

గౌడలకు గుడ్ న్యూస్

మద్యం దుకాణాల్లో పది శాతం రిజర్వేషన్

జిల్లాకు 11 షాపుల కేటాయింపు



నంద్యాల, జనవరి 21, (ఆంధ్రజ్యోతి): కల్లు గీత (గౌడ కులస్థులు) కార్మికులకు ప్రభుత్వం శుభవార్తను అందించింది. మద్యం దుకాణాల్లో కల్లు గీత కులాలకు 10 శాతం రిజర్వేషన్ ఉండేలా మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో త్వరలో 11 కొత్త దుకాణాలు కల్లు గీత కులాలకు చెందిన వారికి టెండర్ ద్వారా అప్పగించనున్నట్లు ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో ఆర్థికంగా వెనుకబడిన వారికి కొంత కలిసి వచ్చే అవకాశం ఉంది.

నంద్యాల జిల్లాలోని ప్రస్తుతం ఉన్న 105 దుకాణాల్లో 10శాతం ఉంటే.. 11 దుకాణాలు కొత్తగా జిల్లాలో రానున్నాయి. కల్లు గీత కులాలైన ఈడిగ-07, గౌడ్-03, గౌడ–1 చొప్పున మొత్తం 11 దుకాణాలు త్వరలో అందుబాటులోకి రానున్నారు. ఇవీ కూడా కల్లు గీత జనాభాలో స్మార్ట్‌పల్స్ సర్వే ఆధారంగా గుర్తించారు. ఆ దుకాణాలను మూడు యూనిట్లుగా మున్సిపాలిటీ, నగర పంచాయతీ, మండల కేంద్రానికి ఒకటి చొప్పున ఉండేలా ఏర్పాటు చేయనున్నారు.

● లైసెన్సు ఫీజు సగానికిపైగా తగ్గింపు...

కల్లు గీత కులాలకు మద్యం దుకాణాల్లో అవకాశం కల్పించడంతో వారికి లైసెన్సు ఫీజును 50శాతం తగ్గించి ఇచ్చేలా ప్రభుత్వ చర్యలు తీసుకుంది. ఈ లైసెన్సు కూడా 30.09.2026 వరకు అనుమతి ఉంటుంది. కాబట్టి త్వరలోనే జిల్లా ఎక్సైజ్ అధికార యంత్రాంగం ప్రభుత్వ నిబంధనలు ప్రకారం క్షేత్రస్థాయిలు పరిశీలించి తగిన నివేదిక తయారు చేయనున్నారు. టెండరులో పాల్గొనే ఆయా అభ్యర్థులు నాట్ రిఫండబుల్ కింద ఒక్కొక్క దుకాణానికి రూ. 2లక్షలు చెల్లించాల్సి ఉంటుందని నిబంధనలు నిర్ణయించారు. ప్రధానంగా అర్హులైన కల్లు గీత ఆయా కులాలకు చెందిన వారికి పారదర్శకంగా ఆయా దుకాణాలను నిబంధనల ప్రకారం అందించే విధంగా ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



కల్లు గీత కులస్థులకు శుభపరిణామం

ప్రభుత్వం కల్లు గీత కులస్థులకు 10శాతం రిజర్వేషన్‌తో మద్యం దుకాణాలను మంజూరు చేయడం శుభ పరిణామం. జిల్లాలో 11 దుకాణాలు రానున్నాయి. ఆయా అభ్యర్థులు తప్పనిసరగా కుల ధ్రువీకరణ పత్రం ఉండాలి.

- రవికుమార్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్



నంద్యాలను స్వచ్ఛ జిల్లాగా తీర్చిదిద్దండి

కలెక్టర్ రాజకుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజకుమారి, అధికారులు

నంద్యాల కల్చరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పారిశుధ్య కార్యక్రమాలు మొక్కుబడి రీతిలో కాకుండా ముమ్మరంగా చేపట్టి నంద్యాలను స్వచ్ఛ జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కలెక్టర్ రాజకుమారి పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఎన్‌ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి చెత్త సంపద తయారీ కేంద్రాలు, సామూహిక మరుగుదొడ్ల కాంప్లెక్సులు తదితర పారిశుధ్య కార్యక్రమాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాలలో ఇంటింటి నుండి సేకరించిన చెత్తను తడి,పొడి చెత్తగా విభజించి చెత్త నుంచి సంపద వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్తపల్లి, శిరివెళ్ల, పాములపాడు, బండి ఆత్మకూరు మండలాలు క్లోరినేషన్, ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులు శుభ్ర పరచడం తదితర విభాగాల్లో వెనుకబడి ఉన్నాయన్నారు. జిల్లాలో 417 సామూహిక మరుగుదొడ్లకు 192 మాత్రమే పూర్తి అయ్యాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి షేక్ జమీవుల్లా, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మనోహర్, జడ్పీ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు కృషితోనే విశాఖ ఉక్కు పరిశ్రమకు భరోసా: మంత్రి బీసీ



బనగానపల్లె, జనవరి 21 (ఆంధ్రజ్యోతి):ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు కృషితోనే విశాఖ ఉక్కు పరిశ్రమకు ఆర్థిక భరోసా లభించిందని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. ఈసందర్భంగా మంతి బనగానపల్లెలో విలేఖర్లతో మాట్లాడుతూ ఉత్తరాంధ్రకే కాక ఏపీకే మణిహారం విశాఖ ఉక్కు కర్మాగారం అన్నారు. వేలాది మంది తెలుగు వారు వీరోచిత పోరాటాలు, త్యాగాలు చేసి సాధించికున్న సంస్థ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పునరుజ్జీవింప చేయడానికి కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తోందన్నారు. నాపై ఉన్న కేసులనుంచి తనను విముక్తి కల్గించండి కావాంటే ఏపీని కేంద్రానికి తాకట్టు పెడతానని అప్పటి సీఎం జగన్ ఢిల్లీకివెళ్ళే వారన్నారు. నేడు అందుకు భిన్నంగా సీఎం చంద్రబాబునాయుడు ఢిల్లీకి వెళి ఏపీని అన్ని రంగాల్లో ముందుకు నడిపించడానికి కృషి చేస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటకు వెళ్లిన ప్రతిసారి ఏపీకి కేంద్రం గుడ్ న్యూస్ చెబుతూనే ఉందన్నారు. నేడు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన విశాఖ ప్లాంట్‌ను కాపాడేందుకు 11,440 కోట్లు ఆర్థిక ప్యాకేజీ ఇచ్చేందుకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినేట్ ఆమోదముద్ర వేసినట్లు బీసీ తెలిపారు. విశాఖ ఉక్కును ప్రవేటుపరం చేయడానికి, ఉకుక ఆస్తులను అమ్ముకోవడానికి జగన్ ప్రయత్నిస్తే నేడు చంద్రబాబునాయుడు విశాఖ ఉక్కును ఏవిధంగా పరిరక్షించాలని అహర్నిశలు కృషి చేశారన్నారు.

దేహదారుఢ్య పరీక్షలో నకిలీ సర్టిఫికెట్

కర్నూలు క్రైం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్పీ బెటాలియన్‌లో జరుగుతున్న కానిస్టేబుళ్ల దేహదారుఢ్య పరీక్షలో తిరుమల్ అనే అభ్యర్థి చీటింగ్‌కు పాల్పడ్డాడు. తిరుమల మంగళవారం ఉదయం దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యారు. మొదట జరిగిన ఎత్తు, ఛాతీ కొలతల్లో డిస్ క్వాలిఫై అయ్యాడు. ఆ తర్వాత బయటకు వెళ్లి మరలా పరుగు పరీక్షల వద్దకు వచ్చాడు. తాను ఎత్తు, ఛాతీ కొలతల్లో క్వాలిఫై అయినట్లు హాల్ టికెట్ చూపించాడు. అనుమానం వచ్చిన ఆర్ఐ నాగభూషణం సర్టిఫికెట్లు చెక్ చేయగా.. ఎత్తు, ఛాతీ కొలతల్లోనే డిస్‌క్వాలిఫై అయినట్లు తేలింది. తిరుమల్ ముందుగానే ఓ నకిలీ హాల్ టికెట్‌లో సెలక్షన్ బోర్డు వేసే హోలోగ్రామ్ ముద్రించి తాను క్వాలిఫై అయినట్లుగా టిక్ మార్కు వేసుకున్నాడు. ఆ తర్వాత 1600 మీటర్ల పరుగు పందెం పాల్గొనేందుకు వచ్చి పోలీసులకు చిక్కాడు. ఆర్ఐ నాగభూషణం నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో తిరుమల్‌పై పిర్యాదు చేశాడు. నిందితుడు కోసిగి మండలం డి. బెళగల్ గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. నిందితుని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

267 మంది ఎంపిక

పోలీసు కానిస్టేబుళ్ల నియామక దేహదారుఢ్య పరీక్షలు మంగళవారం 11వ రోజు కొనసాగాయి. కర్నూలు నగరంలోని ఏపీఎస్పీ రెండో బెటాలియన్‌లో నిర్వహించే ఈ పరీక్షలకు ఎస్పీ జి.బిందుమాధవ్ హాజరై పర్యవేక్షించారు. ఈ పరీక్షకు 600 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా.. 412 మంది అభ్యర్థులు బయోమెట్రిక్‌కు హాజరయ్యారు. 1600 మీటర్ల పరుగు పరీక్షలో 309 మంది అర్హత సాధించారు. 100 మీటర్ల పరుగులో 189 మంది అర్హత సాధించారు. లాంగ్‌జంప్‌లో 263 మంది అర్హత సాధించారు. కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షకు 11వ రోజు 267 మంది అర్హత సాధించారు.

రాష్ట్రాన్ని నాశనం చేసిన జగన్

మంత్రి ఎన్ఎండీ ఫరూక్



నంద్యాల, జనవరి 21, (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల పాలనలో జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని అన్ని విధాలుగా నాశనం చేశాడని న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. ఈ మేరకు ఆయన స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. గత వైసీపీ హయాంలో తనపై నమోదైన కేసుల నుంచి విముక్తి కోసం జగన్‌మోహన్‌రెడ్డి తరచూ ఢిల్లీ వెళ్లేవారని ఆరోపించారు. నేడు అందుకు భిన్నంగా సీఎం చంద్రబాబునాయుడు హస్తినకు వెళ్లి రాష్ట్రానికి ఏదో ఒక విధంగా లబ్ధి చేకూరేవిధంగా చూస్తున్నారని తెలియజేశారు. చంద్రబాబు కృషితోనే విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రూ.11,440 కోట్లు ఆర్థిక ప్యాకేజీ ఇవ్వడానికి కేంద్ర క్యాబినేట్ ఆమోదం తెలిపిందని గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు నాయుడి విశేష కృషితోనే విశాఖ ఉక్కుకు ఆర్థిక భరోసా లభించిందని ఎన్డీయే అధికారంలోకి రాగానే.. ఉత్తరాంధ్ర అభివృద్ధితో పాటు విశాఖ ఉక్కు పరిశ్రమపై ప్రత్యేక దృష్టి సారించి ఎమర్జెన్సీ అడ్వాన్స్ కింద జీఎస్టీ చెల్లింపులకు రూ. 500 కోట్లు, బ్యాంకు అప్పులకు సంబంధించి రూ. 1150 కోట్ల చొప్పున మొత్తం రూ.1650 కోట్లు రెండు విడతల రూపంలో కేంద్రం అందజేస్తుందని వెల్లడించారు.

11 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు, ఒక టీఏ సస్పెండ్

● ఉపాధి పనుల్లో రూ.11,57,339 అవినీతి
● చర్యలు తీసుకున్న అధికారులు



ఉపాధి కార్యాలయం

కోసిగి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో జరిగిన అవినీతికి సంబంధించి 11 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు, ఒక టెక్నికల్ అసిసెంటును అధికారులు సస్పెండ్ చేశారు. వీరంతా 2023-24 సంవత్సరానికి గానూ జరిగిన పనుల్లో అవినీతికి పాల్పడినట్లు ఈ నెల 10వ తేదీన కోసిగిలో సోషల్ ఆడిట్ బృందం బట్టబయలు చేసింది. దీంతో మండలంలో ఉపాధి హామీ పథకంలో రూ.11,57,339 అవినీతి జరిగినట్లు తేలింది. ఇందుకుగాను ఫీల్డ్ అసిస్టెంట్లు అయిన మూగలదొడ్డి గ్రామానికి చెందిన వీరేష్, సాతనూరు విశ్వనాథ్, కందుకూరు సుజాత, చిర్తనకల్ తాయప్ప, పెద్దభోంపల్లి బీ.ఆంజనేయులు, ఐరంగల్ సురేంద్ర, చింతకుంట రాజేష్, జుమాలదిన్నె శివ, గౌడుగల్లు శివారెడ్డి, జంపాపురం నరసప్ప, డి.బెళగల్ నాగరాజులను సస్పెండ్ చేసినట్లు ఏపీవో చంద్రశేఖర్ తెలిపారు. వీరితోపాటు టెక్నికల్ అసిస్టెంట్ ఎం.విజయరాజును కూడా సస్పెండ్ చేశామన్నారు.

బీజేపీని బలోపేతం చేస్తాం

నంద్యాల జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు

నంద్యాల కల్చరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): బీజేపీని బలోపేతం చేస్తామని నూతనంగా నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన అభిరుచి మధు పేర్కొన్నారు. మంగళవారం నంద్యాల బీజేపీ కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా అభిరుచి మధును ఆంధ్రప్రదేశ్ పార్టీ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి చంద్రమౌళీశ్వరరెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా చంద్రమౌళీశ్వరరెడ్డి మాట్లాడుతూ కష్టపడి పనిచేసేవారికి ఎల్లప్పుడు పార్టీ తగిన గుర్తింపు ఇస్తుందన్నారు. ఇందుకు నిదర్శనం కార్యవర్గసభ్యులు నాగన్న, దామోదర్‌రెడ్డి అని వివరించారు. అనంతరం నూత న అధ్యక్షుడు అభిరుచి మధు మాట్లాడుతూ తాను ఎల్లప్పుడూ పార్టీ ఆదేశాలను తూ.చ తప్పకుండా పాటించానని, ఇప్పటి వరకు 33మండలాల్లో బీజేపీ మండల అధ్యక్షులను ఎంపిక చేశామని అన్నారు. 1300 క్రియాశీలక సభ్యత్వాలు చేయించానని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు కశెట్టి క్రిష్ణమూర్తి, డా. ఆదినారాయణ, నాగన్న, దామోదర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గసభ్యులు ఆత్మకూరు మొమిన్‌షబానా, కశెట్టి చంద్రశేఖర్, ఇనుగూరి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా అభిరుచి మధు

మాతా శిశు మరణాల నివారణకు ప్రత్యేక కృషి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎం అండ్ హెచ్ఓ

పాణ్యం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మాతా శిశు మరణాల నివారణకు ప్రత్యేక కృషి చేయాలని నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. మంగళవారం డీఎంఅండ్‌హెచ్ఓ అధ్యక్షతన నంద్యాల ఎంసీహెచ్ బ్లాకులో మాతా శిశు మరణాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగజ్జననీ నగర్, కొలిమిగుండ్ల పీహెచ్‌సీ పరిధిలో జరిగిన మాతా మరణాలపై, మద్దూరు, గాజులపల్లి, గోస్పాడు పీహెచ్‌సీ పరిధిలో జరిగిన శిశు మరణాలపై వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లతో సమావేశం నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో గైనిక్ డీఐఓ డాక్టర్ సుదర్శన్‌బాబు, ఎంసీహెచ్ నోడల్ అధికారి డాక్టర్ ప్రసన్నలక్ష్మి, గైనిక్ హెచ్‌ఓడి డాక్టర్ పద్మజ, పిడియాట్రిక్‌లు డాక్టర్ లలిత, డాక్టర్ అరుణజ్యోతి పాల్గొన్నారు.

కందులు కొనాలని ఆదేశాలు

నంద్యాల రూరల్/ పాణ్యం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : రైతుల నుంచి కందుల కొనుగోలుకు కలెక్టరు ఆదేశాలు జారీ చేశారని నంద్యాల జిల్లా మార్క్‌ఫెడ్ డీఎం హరినాథరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఏపీ రాష్ట్ర ప్రభుత్వం నాఫెడ్ వారి ఆధ్వర్యంలో మార్క్‌ఫెడ్ ద్వారా రూ.7, 550 మద్దతు ధరతో కందులు కొనుగోలు చేయడానికి ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ క్రాప్ చేయించుకున్న రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. మంగళవారం నుంచి ప్రతి రైతు సేవా కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియ ప్రారంభం కానుందన్నారు. ఒక రైతు రోజుకు 40 క్వింటాళ్ల పరిమితి విధించినట్లు తెలిపారు. రైతులు తప్పనిసరిగా వారి పంటను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా, కందులలో తేమ శాతం 12 శాతంలోపు ఉండేలా చూసుకోవాలని కోరారు.

నేటి నుంచి జేఈఈ మెయిన్స్

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ



నంద్యాల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ మెయిన్ పరీక్షకు సర్వం సిద్ధమైంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహించే ఈ జాతీయ ప్రవేశ పరీక్ష తొలి సెషన్ ఈ నెల 22 నుంచి 30 వరకు జరగనుంది. ప్రస్తుతం 22, 23, 24 తేదీల్లో పరీక్ష రాసే అభ్యర్థులకు ఎన్‌టీఏ వెబ్‌సైట్ నుంచి అడ్మిన్ కార్డులు విడుదలయ్యాయి. జిల్లాలో ఒకే ఒక్క పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జేఈఈకి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 22 నుంచి 30 వరకు జరిగే పరీక్షకు హాజరుకానున్నారు. ఆన్‌లైన్ విధానంలో జరిగే ఈ పరీక్ష రోజూ రెండు షిఫ్ట్‌ల ప్రకారం ఉదయం, మధ్యాహ్నం ఉంటుంది. పాణ్యం మండలంలోని ఆర్‌జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో 22, 23, 24, 28, 29, 30 తేదీల్లో పరీక్ష నిర్వహించనున్నారు. 22వ తేదీ ఉదయం 166మంది, మధ్యాహ్నం 144మంది పరీక్షకు హాజరుకానున్నారు. ఇదిలా ఉండగా మిగిలిన తేదీల్లో జరిగే పరీక్షకు ఉదయం 166 మంది, మధ్యాహ్నం 166 మంది హాజరయ్యేవిధంగా కంప్యూటర్లను సిద్ధం చేశారు. పరీక్షలు ముగిశాక ఫిబ్రవరి 12వ తేదీన ఫలితాలు వెలువడనున్నాయి. మార్చి నెల మధ్యలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ముగిసిన అనంతరం ఏప్రిల్ 2వ వారంలో రెండో సెషన్ పరీక్షలను ఎన్‌టీఏ నిర్వహించనుంది.

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

జేఈఈ మెయిన్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించేది లేదని ఎన్‌టీఏ స్పష్టం చేసింది. ఉదయం షిఫ్ట్‌లో 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్ష జరగనుంది. విద్యార్థులకు స్క్రీనింగ్ నిర్వహించనుండటంతో ఉదయం 7:30 గంటల నుంచే పరీక్షా కేంద్రంలోకి అనుమతించనున్నారు. మధ్యాహ్నం రెండో షిఫ్ట్‌లో 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పరీక్ష ఉంటుంది. ఈ విద్యార్థులకు మధ్యాహ్నం 1:30 గంటల నుంచి పరీక్షా కేంద్రంలోనికి అనుమతిస్తారు. అడ్మిన్ కార్డుతోపాటు ఒక పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటో, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన గుర్తింపు కార్డు ఒరిజినల్ కాపీ దగ్గర ఉంచుకోవాలి. ఎలక్ట్రానిక్ పరికరాలను కేంద్రంలోకి అనుమతించరు.

మల్లన్నా నీవే రక్షా..!

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఫిబ్రవరి 19 నుంచి మార్చి ఒకటో తేదీ వరకు శ్రీశైలంలో బ్రహ్మోత్సవాలు ఆరంభం కానున్నాయి. ఈ వేడుకలకు దేశ వ్యాప్తంగా శివభక్తులు లక్షలాదిగా తరలి వస్తారు. అయితే శ్రీశైల క్షేత్రానికి తరలివెళ్లే మల్లన్న భక్తులకు కనీస సదుపాయాలను కల్పించడంలో ఏటా శ్రీశైల దేవస్థానం అధికారులు, జిల్లా యంత్రాంగం విఫలమవుతున్నారు. ప్రత్యేకించి శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్లే భక్తులకు అటవీ మార్గంలో కష్టాలు తప్పడం లేదు. బ్రహ్మోత్సవాల సందర్భంగా కేవలం శ్రీశైలంలో మాత్రమే దేవస్థానం అధికారులు సదుపాయాల కల్పనపై ఫోకస్ చేస్తున్నారు తప్ప ఇతర సమస్యలను పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలోనే శ్రీశైలంలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలపై బుధవారం కలెక్టర్ రాజకుమారి నేతృత్వంలో జరుగుతున్న సమీక్షలో వివిధ సమస్యలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

- ఏటా శ్రీశైల పాదయాత్రికులకు తప్పని అవస్థలు
- మొక్కుబడి సదుపాయాలతో సరిపెట్టుకుంటున్న వైనం
- కర్నూలు-గుంటూరు రహదారిలో కష్టాలు
- ఘాట్‌రోడ్డులో పొంచి ఉన్న ప్రమాదం
- అధ్వానంగా భీమునికొలను మెట్ల మార్గం
- నేడు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలపై కలెక్టర్ సమీక్ష



నల్లమల అటవీ మార్గంలో శ్రీశైలానికి కాలినడకన తరలివెళ్తున్న మల్లన్న భక్తులు(ఫైల్)

ఆత్మకూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రతిఏటా మల్లన్న భక్తులకు కష్టాలు తప్పడం లేదు. ప్రత్యేకించి కాలినడకన తరలివెళ్లే భక్తులకు అటవీ మార్గంలో అనేక అగచాట్లు ఎదురవుతున్నాయి. మహాశివరాత్రి బ్రహోత్సవాల దృష్ట్యా శ్రీశైలానికి అనంతపురం, మహబుబ్‌నగర్ తదితర జిల్లాల నుంచే కాకుండా ఉమ్మడి కర్నూలు జిల్లాలోని కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని, నందికొట్కూరు, డోన్, కర్నూలు, నంద్యాల తదితర ప్రాంతాల నుంచి పాదయాత్రికులు పెద్దసంఖ్యలో తరలిరానున్నారు. వీరిలో కొంతమంది తమ స్వగ్రామాల నుంచే పాదయాత్రగా వస్తుండగా మరికొందరు వెంకటాపురానికి చేరుకుని అక్కడి నుంచి యాత్రను కొనసాగిస్తారు. ముందుగా వెంకటాపురం గ్రామం నుంచి పంటపొలాల మీదుగా నాగలూటి చెంచుగూడేన్ని చేరుకుంటారు. ఆ తర్వాత 5కిమీల అటవీ మార్గంలో ప్రయాణించి నాగలూటి వీరభద్రాలయానికి సందర్శించి అక్కడి నాగలూటి తిప్పలు, దామర్లకుంట, నల్లమల కొండలపై అడవిమార్గం గుండా సుమారు 14 కిలోమీటర్ల మేర భక్తులు ప్రయాణించి పెచ్చెర్వు చెంచుగూడెనికి చేరుకుంటారు. అక్కడి నుంచి కత్తుల కొండ, కోర్కెల గుండా అటవీ ప్రాంతంలో 16కి.మీ ప్రయాణిస్తే.. భీముని కొలను ప్రాంతానికి చేరుకుంటారు. ఆ తర్వాత ప్రమాదకర జారుడు కొండపై ప్రయాణించి కైలాస ద్వారానికి చేరుకుంటారు. అక్కడి నుంచి 6కిమీల దూరం ప్రయాణిస్తే.. శ్రీశైలానికి చేరుకోవచ్చు. అయితే నాగలూటి - పెచ్చెర్వు మధ్యలో ఎక్కడా కూడా ప్రభుత్వ సేవలు అందుబాటులో లేనట్లు తెలుస్తోంది. అదేక్రమంలో పెచ్చెర్వు నుంచి భీముడికొలను మధ్యలో తాగునీటి కోసం ఇక్కట్లు పడాల్సి వస్తోంది. భీమునికొలను కొండ ఎక్కే మార్గం ప్రమాదకరంగా ఉంది. పురాతన మెట్లు చిద్రం కావడంతో కొండపై పాకుతూ వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఈ సమస్య ఏళ్ల తరబడి ఉన్నప్పటికీ పరిష్కారం దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఏదైనా అపశృతులు చోటు చేసుకుంటే ఊహించని పరిణామం ఎదుర్కొవాల్సి వస్తోంది.

సదుపాయాల కల్పనలో విఫలం

శ్రీశైలానికి పాదయాత్రగా తరలివచ్చే భక్తులకు సదుపాయాలు కల్పించడంలో జిల్లా అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. పెచ్చెర్వు, నాగలూటీ ప్రాంతాల్లో దాతలు ఏర్పాటు చేసిన అన్నదాన శిబిరాలను మినహాయిస్తే మిగతా సౌకర్యాలేవి కనిపించవు. నాగలూటిలో వున్న చిన్నపాటి కోనేరు నీరు వేలాది మంది భక్తులకు దాహార్తి తీరుస్తోంది. అయితే కోనేరులో వ్యర్థాలు చేరి కలుషితమవుతున్నాయి. అయినప్పటికీ అవే నీటిని సేవించాల్సిన దుస్థితి నెలకొంది. అలాగే అక్కడే వున్న మరో పెద్దకోనేరులో కూడా శివస్వాములు, పాదయాత్రికులు స్నానమాచరిస్తారు. వేలాదిగా భక్తులు తరలిరావడం వల్ల కోనేరులోని నీరంతా రంగుమారి దుర్వాసన వెదజల్లుతూ రోగాలకు కారణమవుతోంది. వాస్తవానికి నాగలూటి వీరభద్రాలయం వరకు వాహనాలు వెళ్లేందుకు ఆస్కారం వుంది. కనీసం ట్యాంకర్ల ద్వారా నీటి తరలిస్తే తాగునీటి కష్టాలు తీరుతాయి. అలాగే అటవీ ప్రాంతంలో కాకుండా వెంకటాపురం, రాధాపురం ప్రాంతాల్లో మాత్రమే దేవస్థానం వారు విశ్రాంతి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నప్పటికీ అవి భక్తులకు పెద్దగా ప్రయోజనం లేకుండాపోతోంది. పెచ్చెర్వులోనే ఎక్కువ సంఖ్యలు భక్తులు బస చేస్తుంటారు. కానీ అక్కడ దేవస్థానం తరుపున ఏర్పాట్లు అంతంతమాత్రంగా ఉంటున్నాయి.

నడకదారి భక్తులకు ప్రత్యేక దర్శనం

శ్రీశైలానికి కాలినడకన తరలివచ్చే భక్తుల పట్ల దేవస్థానం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలున్నాయి. ఎంతో ప్రయాసతో నడిచి వచ్చే భక్తులను కంపార్టుమెంట్లలో, క్యూలైన్లలో గంటల తరబడి నిరీక్షించేలా చేస్తున్నారు. వాస్తవానికి కొన్నేళ్ల క్రితం తిరుమల తరహాలో నడిచి వచ్చే భక్తులకు పెచ్చెర్వు దాటిన తర్వాత ప్రత్యేక కంకణాలను చేతులను ధరింపజేసేవారు. ఈ కంకణాలు కలిగిన కాలినడక భక్తులకు త్వరగా దర్శనమయ్యేలా చర్యలు ఉండేవి. అయితే కొన్నేళ్లుగా ఈ ప్రక్రియను దేవస్థానం అధికారులు నిలిపివేశారు. దీంతో అటవీమార్గంలో నడిచి వచ్చే ఇబ్బందుల కన్నా.. క్యూలైన్లలో భక్తులు పడే ఇక్కట్లే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కాలినడకన వచ్చే భక్తులపై దేవస్థానం, జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



విశ్రాంతి కేంద్రాలు లేక అటవీ ప్రాంతంలోనే సేదతీరుతున్న శివస్వాములు (ఫైల్)



నాగలూటిలో కలుషిత నీరే శరణ్యం

సమస్యల కేజీ రహదారి



అధ్వానంగా కేజీ రహదారి

శ్రీశైల బ్రహ్మోత్సవాల నేపథ్యంలో శ్రీశైల క్షేత్రానికి లక్షలాది మంది భక్తులు కర్నూలు-గుంటూరు(కేజీ) ప్రధాన రహదారి మీదుగా శ్రీశైలానికి తరలివెళ్తుంటారు. అయితే రహదారి నిర్వహణ అధ్వానంగా ఉండటం వల్ల మల్లన్న భక్తులకు ప్రమాద హెచ్చరికలు మోగుతున్నాయి. ప్రత్యేకించి నల్లమల అటవీ మార్గంలో వున్న కేజీ రహదారికి అక్కడక్కడ ప్రమాదకర మలుపులు వుండటంతో పాటు ప్రమాద సూచికలు లేకపోవడం భక్తుల్లో ఆందోళన గురిచేస్తోంది. అదేవిధంగా రహదారి గుండా పలు ప్రదేశాల్లో రక్షణగోడలను దెబ్బతిన్నాయి. నల్లమల అటవీ మార్గంలో చాలావరకు కేజీ రోడ్డు సింగిల్‌లైన్‌గా వుంది. ఈరోడ్డుపై వాహనాల రాకపోకలకు ధుమ్ము ఏర్పడి వాహన చోదకులకు సమస్యగా మారింది. రోళ్లపెంట ఘాట్ రోడ్డు ట్రాఫిక్ సమస్య వెంటాడుతోంది. కాగా ప్రకాశం జిల్లా పరిధిలోని కేజీ రహదారి పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. అదేవిధంగా దోర్నాల-శ్రీశైలం రహదారిలో కూడా ప్రమాదకర మలుపులు ఉన్నాయి. ఆయా మలుపుల వద్ద స్పీడ్‌బ్రేకర్లు, సూచికలను ఏర్పాటు చేయడంతో పాటు అక్కడక్కడ దెబ్బతిన్న రహదారిని బాగుచేయాలని మల్లన్న భక్తులు కోరుతున్నారు.

వైద్యశిబిరాల నిర్వహణ లోపం



శ్రీశైలానికి తరలివెళ్లే భక్తుల సౌకర్యార్థం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో దారిపొడవునా.. అక్కడక్కడ వైద్యశిబిరాలను ఏర్పాటు చేస్తారు. అయితే వీటి నిర్వహణ ప్రతిఏటా నామమాత్రంగానే నడుస్తున్నాయని అనేక మార్లు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. పైగా వైద్యశిబిరాల్లో జ్వరం, నొప్పులు, విరేచనాలు తదితర మందులు మినహాయిస్తే.. మెరుగైన వైద్యసేవలకు ఉపయోగపడే మందులేవి అందుబాటులో వుండవు. ఈ శిబిరాలు కూడా ప్రధాన ప్రాంతాల్లో తప్ప నట్టడివిలో లేకపోవడంతో భక్తులు అగచాట్లు పడుతున్నారు. అసలే అటవీ ప్రాంతంలో కొండలనుఎక్కుతూ, దిగుతూ.. వెళ్లాల్సి వుంటుంది. ఈ ప్రయాణంలో భక్తులు అస్వస్థతకు గురయ్యే ప్రమాదంతో పాటు కాళ్లకు దెబ్బలు తగిలి రక్తగాయాలు వంటి సంఘటనలు జరుగుతుంటాయి. అదేవిధంగా శ్రీశైలానికి 24గంటల పాటు భక్తులు తరలివెళ్తుంటారు. అయితే వైద్యశిబిరాలు మొక్కుబడిగా నిర్వహిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. కాగా నడిచి వెళ్లే భక్తులు అస్వస్థతకు, గుండెపోటుకు గురై మరణించిన సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అటవీ మార్గంలో అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచుతాముని దేవస్థానం అధికారులు తెలిపినప్పటికీ గత ఏడాది ఎక్కడా కనిపించలేదు.

తెలుగు కీర్తి పురస్కారాలు ప్రదానం



నాగేశ్వరయ్యను సత్కరిస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన ఇద్దరు తెలుగు కీర్తి పురస్కారాలను అందుకున్నారు. కర్నూలుకు చెందిన కవి, రచయిత, కళాకారుడు కేవీ నాగేశ్వరయ్య, ప్రజా కవి, జిల్లా వినియోగ దారుల కమిషన్ సభ్యుడు ఎన్. నారాయణరెడ్డిలు ఈ పురస్కారాలను అందుకున్నారు. మంగళవారం విజయవాడలోని శ్రీకౌతా పూర్ణానంద విలాస్ సమావేశ హాలులో శ్రీశ్రీ కళావేదిక సంస్థ ప్రకటించిన 'తెలుగు కీర్తి' పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా నాగేశ్వరయ్య, నారాయణ రెడ్డిలకు నిర్వాహకులు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేసి శాలువకప్పి పుష్పమాలతో ఘనంగా సత్కరించారు. ఈ పురస్కారం తమకు మరింత స్ఫూర్తినిచ్చిందని నాగేశ్వరయ్య, నారాయణరెడ్డిలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్, వేదిక ప్రతినిధులు పాల్గొన్నారు.



పురస్కారం అందుకుంటున్న నారాయణరెడ్డి

కేన్సర్ హాస్పిటల్‌కు రూ.25 లక్షలు

జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు



కర్నూలు హాస్పిటల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): స్టేట్ కేన్సర్ హాస్పిటల్‌కు కావాల్సిన కనీస పరికరాల కొనుగోలు కోసం సీఏడీఎస్ నుంచి రూ.25 లక్షల నిధులు వాడుకోవడానికి అడిషన ల్ డీఎంఈ డాక్టర్ పి.వెంకటేశ్వర్లు ఆమోదం తెలిపినట్లు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. ఆంధ్రజ్యోతిలో ఆదివారం ప్రచురితమైన 'సర్దుబాటు చేయడానికి వచ్చారా..?' అన్న కథనంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ వివరణ ఇచ్చారు. కేన్సర్ హాస్పిటల్‌కు సంబంధించి రావాల్సిన ఇతర పరికరాల కోసం ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీరింగ్ అధికారులతో నేరుగా మాట్లాడి వాటిని త్వరితగతిన ఆసుపత్రికి అందించడానికి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించినట్లు తెలిపారు. సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది కోసం రిక్రూట్‌మెంట్ త్వరగా చేయడానికి ఆదేశించినట్లు చెప్పారు. శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ నూతన ఏజెన్సీలు టెండర్ల ప్రక్రియ ఈ నెల చివరికల్లా పూర్తవుతుందని, ఈ టెండర్లలోనే కేన్సర్ హాస్పిటల్‌కు కూడా సిబ్బంది వస్తారని చెప్పారు. ఆక్సిజన్ పైపులైన్, జనరేటర్, పనులు వారంలోపు ఇంజనీర్ అధికారులు పూర్తి చేయిస్తారన్నారు. 15 మంది శానిటేషన్, 15 మంది సెక్యూరిటీ సిబ్బందిని కేన్సర్ హాస్పిటల్‌కు తాత్కాలికంగా కేటాయించామని చెప్పారు. ఫిబ్రవరి మొదటి వారంలో ఎట్టి పరిస్థితుల్లో స్టేట్ కేన్సర్ ఆసుపత్రి ప్రారంభించడానికి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, స్పెషల్ సీఎస్ కృష్ణబాబు ఆదేశించారని, ఇందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

అప్‌గ్రేడేషన్‌లో నిబంధనలు పాటించాలి: ఆర్జేడీ



సమావేశంలో మాట్లాడుతున్న కడప ఆర్జేడీ శ్యామూల్

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ప్రాథమికోన్నత పాఠశాలల అప్‌గ్రేడేషన్‌లో నిబంధనలు పాటించాలని కడప ఆర్జేడీ శ్యామూల్ ఆదేశించారు. మంగళవారం స్థానిక జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలోని సమావేశ భవనంలో డీఈవో శ్యామ్యూల్ పాల్ అధ్యక్షతన ఎంఈవోలతో సమావేశం నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు ఉండాలన్నారు. గ్రామంలోని ప్రతి తరగతికి ఒక టీచర్ ఉండేలా చూడాలన్నారు. పాఠశాలల్లో 120 మంది విద్యార్థులు ఉంటే పాఠశాలల ప్రధానో పాధ్యాయుల పోస్టును ఇస్తారన్నారు. విద్యార్థుల సంఖ్య 150 మంది ఉంటే.. ప్రతి 30 మంది విద్యార్థులకు అదనంగా ఒక టీచర్‌ను నియమించనున్నట్లు తెలిపారు. ఈ నెల 24న కర్నూ లులో ఎంఈవోలు, హెచ్ఎంలతో రాష్ట్ర పాఠశాలల విద్యా కమిష నర్ విజయరామరాజు సమావేశం నిర్వహిస్తారని, జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలోని సమావేశ భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపీసీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పౌరాణిక నాటకానికి చిరునామా 'చీమకుర్తి'

టీజీవీ కళాక్షేత్రంలో కళాకారుల ఘన నివాళి

కర్నూలు కల్చరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): సత్య హరిశ్చంద్ర నాటకానికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చి చిరునామాగా దివంగత నటుడు చీమకుర్తి నాగేశ్వరరావు నిలిచిపోయారని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు విద్వాన్ పత్తి ఓబులయ్య కొనియాడారు. మంగళవారం చీమకుర్తి 19వ వర్ధంతిని పురస్కరించుకొని నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో చీమకుర్తి చిత్రపటానికి పుష్పమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన పౌరాణిక పద్య నాటక రంగానికి చేసిన సేవలను వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా పత్తి ఓబులయ్య మాట్లాడుతూ కేవలం ఐదో తరగతి వరకు చదివిన చీమకుర్తి మూడు వేలకు పైగా సత్య హరి శ్చంద్ర నాటకాన్ని ఆంధ్రదేశంతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రదర్శించారని అన్నారు. ఆయన 2006 జనవరి 21న దివంగతులయ్యారని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాక్షేత్రం కార్య దర్శి మహ్మద్ మియా, ప్రతినిధులు ఇనాయతుల్లా, ఈ.పాండురంగయ్య, గాండ్ల లక్ష్మన్న, పీపీ గురుమూర్తి, డి.ఈశ్వరయ్య, సీవీ రెడ్డి, బాలవెంకటేశ్వర్లు, కేవీ రమణ, జాఫర్, క్రిస్టఫర్ తదితరులు పాల్గొన్నారు.



చీమకుర్తి నాగేశ్వరరావుకు నివాళి అర్పిస్తున్న పత్తి ఓబులయ్య, కళాకారులు

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా రామకృష్ణ

బీసీ నేతకు పట్టం కట్టిన అధిష్ఠానం

కర్నూలు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ (బీజేపీ) జిల్లా అధ్యక్షుడిగా బీసీ నేతకు అధిష్ఠానం పట్టం కట్టింది. మంత్రాలయం నియోజకవర్గం కౌతాళం గ్రామానికి చెందిన అక్కమ్మతోట రామకృష్ణ ఎంపికయ్యారు. మంగళవారం స్థానిక నరసింహారెడ్డి నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్ష ఎన్నికలు జరిగాయి. జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా పోతుకుంట రమేశ్‌నాయుడు, కర్నూలు పార్లమెంట్ రాష్ట్ర పరిశీలకులు కృష్ణయ్యయాదవ్ ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. ప్రస్తుత అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ సహా పలువురు సీనియర్ నేతలు, యువ నాయకులు జిల్లా అధ్యక్ష పీఠం కోసం పోటీ పడ్డారు. పది రోజుల క్రితమే జిల్లా అధ్యక్ష ఎన్నిక ప్రక్రియ మొదలైంది. 12 మంది నాయకులు జిల్లా అధ్యక్ష పదవి ఆశిస్తూ నామినేషన్లు దాఖాలు చేశారు. ఆ నామినేషన్లు పరిశీలించిన రాష్ట్ర అధిష్ఠానం, ఎన్నికల విభాగం 12 మందిలో కౌతాళంకు చెందిన రామకృష్ణ, కర్నూలుకు చెందిన అంబలి కాశీవిశ్వనాథ్ పేర్లను ఎంపిక చేసి జాతీయ నాయకత్వానికి పంపించారు. ఆ ఇద్దరిలో బీసీలలో రజక సామాజికవర్గానికి చెందిన రామకృష్ణ వైపు మొగ్గు జాతీయ నాయకత్వం మొగ్గు చూపింది. మంగళవారం జరిగిన సమావేశంలో ఎన్నికల అధికారి పోతుకుంట రమేశ్‌నాయుడు రాష్ట్ర నాయకత్వం సూచన మేరకు బీజేపీ జిల్లా నూతన అధ్యక్షుడిగా రామకృష్ణ పేరును ప్రకటించారు. ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, తాజా మాజీ అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, సీనియర్ నాయకులు రామకృస్వామి, డాక్టర్ వినీషారెడ్డి, న్యాయవాది గీతామాధురి, కాశీవిశ్వానాథ్, జీఎన్ నాగరాజు, ప్రేమకుమార్ తదితరులు పూలమాలలతో రామకృష్ణను అభినందించారు. అనంతరం బీజేపీ సీనియర్ నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ సహా పలువురు సీనియర్ నాయకులను కలిశారు.

రాష్ట్ర సమన్వయ కమిటీ కన్వీనర్ కపిలేశ్వరయ్య ప్రొత్సాహంతో 2012లో సామాన్య కార్యకర్తగా చేరిన రామకృష్ణ మండల అధ్యక్షుడిగా, జిల్లా ఉపాధ్యక్షుడిగా, బీసీ మోర్చ, కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. పార్టీ అప్పగించిన త్రీమెన్ కమిటీ కన్వీనర్, బూత్ స్వశక్తీకరణ జిల్లా కన్వీనర్ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించారు. కరోనా సమయంలో బీజేపీ హెల్త్ వాలంటరీ కన్వీనర్‌గా సేవలు అందించారు. ప్రస్తుతం జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతూ.. జిల్లా అధ్యక్ష పీఠం దక్కించుకున్నారు. రామకృష్ణది వ్యవసాయ కుటుంబం. ఆయన తల్లిదండ్రులు వెంకమ్మ, కృష్ణయ్య, భార్య అమృత, కుమార్తె కల్పన, కుమారుడు దుర్గాప్రసాద్ సంతానం.



మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్‌ను కలిసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, ఆ పార్టీ నాయకులు

పార్టీ బలోపేతం చేస్తా : రామకృష్ణ

బీజేపీ జాతీయ అధ్యక్షడు జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరిలు నాపై ఎంతో నమ్మకంతో జిల్లా అధ్యక్ష పదవి ఇచ్చారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా ఆశీస్సులతో జిల్లా సీనియర్ నాయకులు, నియోజకవర్గం కన్వీనర్లు, అనుబంధ సంఘాల నాయకులు, యువ నేతలను సమన్వయం చేసుకుంటూ గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తాను. కేంద్రంలో ప్రధాని మోదీ సామరథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం, రాష్ట్రంలో సీఎం చంద్రబాబు సామరథ్యంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఇంటికి అందేలా చూస్తా. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి సర్దుబాటు ప్రకారం బీజేపీ కేటాయించే స్థానాల్లో, కూటమి పార్టీలు విజయం సాధించేందుకు కృషి చేస్తా.



మాతృ మరణాలపై సమీక్ష నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో

రక్తహీనత గర్భిణులను త్వరగా గుర్తించాలి

కర్నూలు హాస్పిటల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో ఏఎన్ఎం, ఆశా, వైద్యాధికారులు రక్తహీనతగల గర్భిణులను గుర్తించి వారికి వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ ఆదేశించారు. జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలో నవంబరు, డిసెంబరు నెలలో జరిగిన మాతృ మరణాలపై డీఎంహెచ్‌వో జిల్లా స్థాయి సమగ్ర గర్భస్రావ సంరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం మాతృ మరణాల నివారణ కోసం కర్నూలు జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్ ఎమ్మిగనూరు చెందిన ధీరన్ మెడికల్ హాస్పిటల్ వైద్యులను సమీక్షకు పిలిపించి తగు సూచనలు చేశారు. సమీక్షలో డీసీహెచ్ఎస్ డా.మాధవి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.సత్యవతి, డీఐవో డా.నాగప్రసాద్, కర్నూలు జీజీహెచ్ గైనకాలజి ప్రొఫెసర్లు డా.పద్మజ, డా.మంజూషా, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.ప్రియాంక, నెఫ్రాలజిస్టు డా.శ్రీధర్‌శర్మ, కల్లుదేవకుంట పీహెచ్‌సీ డా.భావన, డీపీహెచ్ఎన్‌వో అన్నపూర్ణ, ఎస్‌వో హేమసుందరం పాల్గొన్నారు.

గోదాముల అద్దె చెల్లించకుంటే సీజ్

- ఆదోని మార్కెట్ యార్డు కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి



ఆదోని అగ్రికల్చర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డ్‌లో గోదాముల అద్దె చెల్లించాలని, లేకుంటే రెవెన్యూ రికవరీ యాక్ట్ ఉపయోగించి గోదాములను సీజ్ చేస్తామని మార్కెట్ యార్డ్ కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆయన తన చాంబర్‌లో మాట్లాడుతూ మూడేళ్లుగా కొంతమంది లైసెన్స్ పొందిన కమీషన్ ఏజెంట్స్, వ్యాపారులు తాము ఉండే గోదాములకు అద్దె చెల్లించకుండా మొండికేశా రన్నారు. అద్దె చెల్లించిన వారికి పలుమారులు నోటీసులు జారీచేసినా పట్టించుకోవడం లేదన్నారు. రూ.38 లక్షలు పేరుకుపోయిందని అన్నారు. వారు వ్యాపారాలు చేసుకొని లైసెన్సులు రెన్యువల్ చేసుకోకుండా అలాగే దుకాణాల్లో కొనసాగుతున్నారని, దీంతో తాము హెచ్చరించి కొన్నిటికి తాళాలు వేశామని అన్నారు. ఇక నుంచి ఉపేక్షించమని అద్దె చెల్లించని గోదాములను రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం మధ్య సీజ్ చేస్తామని చివరి నోటీసు అందించామన్నారు.

నేడు కాంగ్రెస్ జై సంవిధాన్ పాదయాత్ర

కర్నూలు అర్బన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి అమిత్ షా అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ చేపట్టిన జై సంవిధాన్ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు డీసీసీ పరిగెల మురళీకృష్ణ తెలిపారు. బుధవారం ఉదయం 10.45కు జై బాపూజీ, జైభీమ్, జై సంవిధాన్ పాదయాత్రలో కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమయ్యే పాదయాత్ర పాత బస్టాండ్ చేరుకొని, అక్కడ గల అంబేద్కర్ విగ్రహనికి పూలమాలలు వేశాక, మీటింగ్ జరుగుతుందని పేర్కొన్నారు.

'వేరుశనగ విత్తనాలు కొనాలి'



నేషనల్ సీడ్స్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

నంద్యాల రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వేరుశనగ విత్తనాలు కొనుగోలు చేసి తమకు న్యాయం చేయాలని కోరుతూ గోస్పాడు మండలం ఎంకృష్ణాపురం గ్రామ వేరుశనగ సాగు రైతులు నూనెపల్లెలోని నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తంచేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సీడ్స్ కార్పొరేషన్ అగ్రిమెంట్ ద్వారా పండించిన వేరుశనగ విత్తనాలను కొనుగోలు నిమిత్తం 40 రోజుల క్రితం నేషనల్ సీడ్స్ కార్పొరేషన్‌కు తరలించామన్నారు. కంపెనీ నిబంధనల ప్రకారం కేజి వేరుశనగకు రూ.50 ప్రకారం రైతులకు చెల్లించాల్సి ఉండగా ఇంతవరకు రూపాయి కూడా చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సరఫరా చేసిన విత్తనాలను కూడా ప్రాసెసింగ్ చేయడానికి అధికారులు నిరాకరిస్తున్నారని ఆరోపించారు. విత్తనాలు వానలో తడిసి బాగాలేవని అభాండాలు వేస్తున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. ఒక్కొక్క ఎకరా సాగుకు రూ70,000 ఖర్చు చేశామని, సాగుకు బ్యాంకుల, ప్రవేట్ వ్యక్తుల వద్ద అప్పులు చేశామని, ప్రస్తుతం దిక్కుతోచని స్థితిలో ఉన్నామన్నారు, సీడ్స్ కార్పొరేషన్ వేరుశనగ విత్తనాలను కొనుగోలు చేయక పోతే ఆత్మహత్యే శరణ్య మన్నారు. నేషనల్ సీడ్స్ అధికారులు అగ్రిమెంట్ మేరకు విత్తనాలను కొనుగోలు చేయాలని, మొలకల శాతంలో ఎమైనా తేడాలొస్తే బాధ్యత వహిస్తామన్నారు.'

విద్యుదాఘాతంతో రైతు మృతి



కురువ నాగన్న (ఫైల్)

మంత్రాలయం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలం లోని వగరూరు గ్రామానికి చెందిన కురువ నాగన్న (76) అనే రైతు ఇంటి వద్ద విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం జరిగింది. మంత్రాలయం ఎస్ఐ పరమేష్ నాయక్, కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. మృతుడు నాగన్న తన కొత్త ఇంటి నిర్మాణం చేపట్టాడు. కొడుకు టీరప్ప గోడకు సీలింగ్ చేస్తున్నాడు. ఇంటి వద్ద కొళాయి మోటారును ఆఫ్ చేయాలని చెప్పడంతో నాగన్న స్విచ్ఛాఫ్ చేయడానికి వెళ్లి విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య అంజినమ్మ, ముగ్గురు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. విషయం తెలుసుకున్న మంత్రాలయం పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి సోదరుడు సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని చెప్పారు.

వ్యక్తి ఆత్మహత్య

బనగానపల్లె, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలం లోని పలుకూరు గ్రామానికి చెందిన చాకలి నాగేంద్రప్రసాద్ (26) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య మంగళవారం తెలిపారు. గత కొన్ని నెలల నుంచి నాగేంద్రప్రసాద్ కడుపునొప్పితో బాధప డేవారని, అనేకసార్లు డాక్టర్లకు చూపించినా రోగం తగ్గకపో వడంతో జీవితంపై విరక్తి చెంది పలుకూరులోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద పురుగుల మందు తాగినట్లు ఎస్ఐ తెలిపారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు ఆయన వెల్లడించారు. భార్య చాకలి మద్దమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారని చెప్పారు.

చెవి కమ్మను లాక్కెళ్లిన దుండగుడు

సి. బెళగల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదర్శ పాఠశాల సమీపంలో నడుచుకుంటూ వెళుతున్న వృద్ధురాలు అనుమక్క చెవి కమ్మను ఎమ్మిగనూరు నుంచి మోటార్ సైకిల్‌పై వెళుతున్న వ్యక్తి లాక్కెళ్లాడు. ఈ ఘటన మంగళవారం జరిగింది. దీనిపై ఆమె కుమారులు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ తిమ్మారెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ముగిసిన అంతర్రాష్ట్ర ఫుట్‌బాల్ పోటీలు



ఫలక్‌నుమా జట్టుకు ట్రోఫీ ఇస్తున్న తహసీల్దార్ శేషఫణి



రన్నర్స్ ట్రోఫీతో ఎమ్మిగనూరు జట్టు

- ట్రోఫీని కైవసం చేసుకున్న ఫలక్‌నుమా జట్టు

ఎమ్మిగనూరు టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా జరుగుతున్న అంతర్రాష్ట్ర ఫుట్‌బాల్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. బీవీ జయనాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక బాలుర కళాశాల మైదానం నిర్వహించిన ఈ పోటీల్లో 40 టీమ్‌లు పోటీ పడ్డాయి. మంగళవారం ఫైనల్ మ్యాచ్‌లో ఫలక్‌నుమా, ఎమ్మిగనూరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి.

నిర్ణీత సమయంలో రెండు జట్లు 3-3 గోల్స్‌తో నిలవగా రెఫరీలు ఇరుజట్లకు మరో 20 నిమిషాలు సమయం కేటాయించాయి. మరోసారి డ్రా కాగా పెనాల్టీ షూటౌట్ నిర్ణయించారు. ఇందులో ఫలక్‌నుమా 4-2 గోల్స్ చేసింది. దీంతో ఫలక్‌నుమాను విజేతగా ప్రకటించారు. అంతకు ముందు 3వ స్థానం కోసం హైదరాబాద్ గ్లోబల్ ఎఫ్‌సీ, చైతు ఎఫ్‌సీ జట్లు పోటీ పడగా హైదరాబాద్ గ్లోబల్ ఎఫ్‌సీ 3-0 గోల్స్‌తో విజయం సాధించి 3వ స్థానం కైవసం చేసుకుంది. ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ శేషఫణి, డీఈ నాగేంద్రప్రసాద్‌లు మాట్లాడుతూ నిర్వాహకులు ఎక్కడ రాజీ పడకుండా ఆటగాళ్లకు వసతులు కల్పించారని అన్నారు. విన్నర్స్‌కు ట్రోఫీతోపాటు నగదు రూ.1,50,000, రన్నర్స్ జట్టుకు ట్రోఫీతో పాటు నగదు రూ.లక్ష ప్రదానం చేశారు. నిర్వాహకులు రామకృష్ణ నాయుడు, కామర్తి మహేష్, ఎన్‌బీకే ఈరన్న, బందె నవాజ్, భాస్కర్, మహేంద్ర బాబు, ప్రిన్సిపాల్ కృష్ణయ్య, చిత్రలేఖ, వనజ, విజేత నాగరాజు, కుమార్, సర్దాజ్, ఆర్మీ రఘు, వంశీ, ఈరన్న పాల్గొన్నారు.

- అంతర్రాష్ట్ర ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో విదేశీ ఆటగాళ్లు పాల్గొన్నారు. వీరు వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయంలో బీ ఫార్మసీ, బీటెక్‌ల చదువు కోసం ఇండియాకు వచ్చారు. ఆరు రోజుల పాటు జరిగిన పోటీల్లో నైజీరియన్ క్రీడాకారులు ఉన్న గ్లోబల్ ఎఫ్‌సీ టీమ్ సెమీఫైనల్ చేరడం విశేషం. వీరు ఇక్కడ ఫుట్‌బాల్ వీరి ఆటను చూడడానికి ప్రజలు ఆసక్తి కనబరిచారు.

'వాల్మీకులపై తప్పుడు ప్రచారం తగదు'



మాట్లాడుతున్న వాల్మీకి సంఘం నాయకులు

కర్నూలు కలెక్టరేట్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి వ్యతిరేక శక్తులు వాల్మీకుల గురించి తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, ఇది తగదని వాల్మీకి సంఘం నాయకుడు కుబేరస్వామి, మహర్షి వాల్మీకి రిజర్వేషన్ ప్రజా సమితి రాష్ట్ర అధ్యక్షుడు బోయ పులికుండన్న మహర్షి వాల్మీకి రిజర్వేషన్ ప్రజాసమితి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నాగేశ్వరి నాయుడు సూచించారు. కర్నూలు నగరంలోని బీసీ భవన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి ఏపీలో వాల్మీకులు 1956కు ముందు ఎస్టీలుగా ఉన్నారని, అయితే కొందరు రాజకీయ కుట్రతో ఎస్టీలుగా తొలగించారన్నారు. మైదాన ప్రాంతంలో బోయలు బీసీలుగా, ఏజెన్సీలో ఎస్టీలు అని విభజించారని అన్నారు. ఆనాటి నుంచి వాల్మీకులు ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరణ కోసం పోరాటం చేస్తున్నారన్నారు. పాలకులు ఎన్నికల ముందు ఒక మాట, తర్వాత ఒక మాట మాట్లాడుతూ మోసం చేస్తూనే ఉన్నారు. వాల్మీకులు ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందరాని తప్పుడు ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. ఎస్టీలుగా కొత్తగా చేర్చాలని కోరడం లేదని, పునరుద్ధరణ చేయాలని కోరుతుండగా కొందరు అవగాహన లేక మాట్లాడుతున్నారని అన్నారు. వీబీఎస్ఎస్ పెద్దయ్య, ఎంవీఆర్‌పీఎస్ నాయకులు సుధాకర్ నాయుడు, నరసింహులు, సాయి, వంశీ నాయుడు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం అక్రమ రవాణా తగ్గింది

- ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్‌బాబు



కోసిగి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక మద్యం అక్రమ రవాణా తగ్గుముఖం పట్టిందని, ప్రైవేటు వైన్ షాపుల వల్ల ప్రభుత్వ ఆదాయం భారీగా పెరిగిందని ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్‌బాబు అన్నారు. మంగళవారం కోసిగిలోని ఎక్సైజ్ సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సుధీర్‌బాబు మాట్లాడుతూ కోసిగి, పెద్దకడుబూరు మండలాల పరిధిలోని నాలుగు మద్యం దుకాణాలకు గానూ మూడు నెలల్లో రూ.10 కోట్లు మద్యం అమ్మకాలు జరిగాయని అన్నారు. కర్ణాటక మద్యం కొన్ని ప్రాంతాల్లో ఇంకా సరఫరా అవుతోందని పూర్తిగా అరికట్టాలని పోలీసులకు సూచించారు. అలాగే కర్నూలు జిల్లాలో కల్లు గీత కులాలకు సంబంధించి జిల్లాకు 10 మద్యం షాపులకు నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. జిల్లాలో గౌడ కులాలకు 3, ఈడిగలకు 6, గౌడకు మొత్తం 10 దుకాణాలకు నోటిఫికేషన్ విడుదల చేశామని తెలిపారు. అభ్యర్థులు తమ కుల, నేటివిటీ ధ్రువపత్రాలు సమర్పించాలని, ఒక షాపునకు ఫీజు రూ.2 లక్షలు, నాన్ రెఫండబుల్ అని తెలిపారు. ఒక అభ్యర్థికి ఒక షాపు మాత్రమే ఇస్తామన్నారు. ఈ షాపు గడువు 30.09.2026 వరకు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి, ఎస్ఐ కార్తిక్ సాగర్, ఎక్సైజ్ సిబ్బంది ఉన్నారు.

నాగలదిన్నెలో గుప్త నిధుల పుకార్లు

నందవరం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగలదిన్నె గ్రామంలో గుప్త నిధులు లభ్యమయ్యాయని పుకార్లు రావడంతో మంగళవారం అధికారులు గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టారు. తుంగభద్ర నది దగ్గర వైద్యశాల వెనుక భాగంలో చెట్లు కొడతూ వాటి బుడమలు తొలగిస్తుం డగా వాటి కింద 40 కేజీల బంగారు అండ దొరికినట్లు పుకార్లు వచ్చాయి. దీంతో తహసీల్దారు శ్రీనివాసులు, ఎస్ఐ శ్రీనివాసులు నాగలదిన్నె గ్రామానికి చేరుకొని మంగళవారం విచారణ చేశారు. రెండు రోజుల తర్వాత వివరాలు తెలుస్తాయని అధికారులు తెలిపారు.



నాగలదిన్నెలో విచారణ చేస్తున్న అధికారులు

సుప్రీంకోర్టులో అనుకూలమైన తీర్పు

- రాఘవేంద్రస్వామి మఠంలో సంబరాలు



మాట్లాడుతున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం జనవరి 21(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘ వేంద్రస్వామి గురువులైన మధ్వాచార్యుల ప్రత్యక్ష శిష్యులైన నరహరి తీర్థులు రాఘవేంద్రస్వామి మఠానికి అనుకూలంగా సుప్రీం కోర్టులో తీర్పు రావడంతో సంబరాలు చేసుకున్నారు. మంగళవారం సాయంత్రం తీర్పు రాగానే మఠం పీఠాధిపతులు సుబుధేంద్రతీర్థులు, మఠం అధికారులు, శిష్యులు, ఉద్యోగులు, భక్తులు బాణాసంచా పేల్చి పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఊంజల మండపంలో భక్తుల నుద్దేశించి పీఠాధిపతి మాట్లాడారు. గత 26 ఏళ్లుగా నరహరి తీర్థుల బృందావనానికి పూజలు చేయకుండా ఉత్తరాధి మఠం చెందిన యజ మాన్యం కోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారని, కింది కోర్టు ఆర్డర్లను రద్దు చేస్తూ వారి పిటిషన్‌ను సుప్రీం కోర్టు తిరస్కరించడంతో పెద్ద ఎత్తున భక్తులు మంగళవారం రాత్రే నరహరితీర్థులు వెలసిన హంపి తుంగభద్ర నది వద్ద వెలసిన నరహరితీర్థుల బృంధావనానికి బయలుదేరి వెళ్లారు. బుధవారం వేలాదిమంది సంబరాలు చేసుకోవాలని పీఠాధిపతి పిలుపునిచ్చారు. ఇది అందరి విజయమని రాఘవేంద్రస్వామి శిష్యులకు అంకితమన్నారు. కార్యక్ర మంలో విద్వాన్ రాజా ఎస్ గిరిరాజాచార్, ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషీ, శ్రీపతాచార్, ఈఈ, మేనేజర్-సీ సురేష్ కోనాపూర్, బీఎం ఆనందరావు, ఐపీ నరసంహమూర్తి, అనంతపు రాణిక్, రవికుల కర్ణి, విజయేంద్రాచార్, గోపాలకృష్ణ స్వామి, వాదీంద్రాచార్, రాజాఎస్ అప్రమేయాచార్, ఎస్ఎన్ రఘునందనాచార్, అధికారులు పాల్గొన్నారు.

నేడు కర్నూలుకు డీజీపీ

కర్నూలు క్రైం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డీజీపీ ద్వారక తిరుమల్‌రావు బుధవారం కర్నూలుకు రానున్నారు. ఉదయం నంద్యాలలో తనిఖీ చేసి అనంతరం కర్నూలు రానున్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా కర్నూలుకు వస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

భూ సేకరణ వేగవంతంగా పూర్తి చేయండి

కర్నూలు కలెక్టరేట్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): వివిధ జాతీయ రహదారుల నిర్మాణం, విస్తరణ వాటిపై బైపాస్ రహదారుల నిర్మాణానికి సంబంధించి అవసరమైన భూసేకరణను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్లు, జేసీలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే.విజయానంద్ ఆదేశిం చారు. జాతీయ రహదారుల నిర్మాణం, విస్తరణ, బైపాస్ రహదారుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ, అటవి అనుమతుల మంజూరు తదితర పెండింగ్ అంశాలపై మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి రెవెన్యూ అటవి, టీఆర్అండ్‌బీ జాతీయ రహదారుల సంస్థ, మినిస్ట్రీ ఆఫ్ రోడ్డు ట్రాన్స్‌పోర్టు అడ్ హైవేస్ శాఖల అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్, జేసీలతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ నవ్య పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి



రాజేశ్వరిని సన్మానిస్తున్న ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి

గోనెగండ్ల, జనవరి 21(ఆంధ్రజ్యోతి): బాలికలు అన్ని రంగాలలో రాణించాలని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. మంగళవారం గోనెగండ్లలోని కస్తూర్బా బాలికల పాఠశాలను ఎమ్మెల్యే పరిశీలించారు. పాఠశాలలో ఇంటర్ చదువుతున్న రాజేశ్వరి ఇటీవల మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో జాతీయ స్థాయిలో బేస్‌బాల్ పాల్గొని ప్రతిభను చాటింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పార్థసారథి విద్యార్థినిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఆడపిల్ల పుట్టగానే భయపడే నేటి సమాజంలో ఇలాంటి అమ్మాయిలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ గంగాధర్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం కృషితో విశాఖ ఉక్కుకు భరోసా

టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, టీటీడీ పాలక మండలి సభ్యుడు మల్లెల రాజశేఖర్



మాట్లాడుతున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు కృషితో విశాఖ ఉక్కు పరిశ్రమకు కేంద్రం నుంచి ఆర్థిక భరోసా లభించిందని నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు, టీటీడీ పాలక మండలి సభ్యుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. మంగళవారం హుస్సేనాపురం గ్రామంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు కృషి, పట్టుదల వల్లే ఆర్థిక సంక్షోభంలో ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రం రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీ ఇచ్చిందని అన్నారు. దీనికి కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదముద్ర వేయడం అభినందనీయమని అన్నారు. ఏటా 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉన్న స్టీల్‌ప్లాంట్ గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిందని విమర్శించారు. ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉత్తరాంధ్ర అభివృద్ధితో పాటు విశాఖ ఉక్కు పరిశ్రమపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఉత్తరాంధ్రకే కాకుండా మొత్తం ఏపీకే విశాఖ ఉక్కు కర్మాగారం మణిహారం అన్నారు. ఆనాడు ఎంతో మంది తెలుగు వారు వీరోచిత పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న సంస్థను పునరుజ్జీవింపజేస్తుందని అన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయాలని, ఉక్కు ఆస్తులను అమ్ముకోవాలని జగన్ ప్రయత్నిస్తే, విశాఖ ఉక్కును పరిరక్షించాలని చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహబూబ్ బాషా, కెవి. మధు, బజారు, వేణు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు కృషి అమోఘం: ఎంపీ శబరి



నంద్యాల, జనవరి 21, (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు పరిశ్రమను సంక్షోభం నుంచి ఆదుకునేందుకు సీఎం చంద్రబాబు నాయుడు చేసిన కృషి అమోఘమని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మంగళవారం ప్రకటన ద్వారా తెలియజేశారు. సీఎం కృషితోనే నేడు కేంద్రం రూ.11,440 కోట్లు సాయాన్ని అందిం చారన్నారు. గత సీఎం జగన్ విశాఖ ఉక్కును ఏమాత్రం పట్టించుకోలే దుని విమర్శించారు. సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యాటను వెళ్లి వచ్చిన ప్రతిసారి కేంద్రం నుంచి రాష్ట్రానికి గుడ్ న్యూస్‌ను తీసుకొస్తున్నారన్నారు. ఉక్కు కర్మాగారానికి రికార్డుస్థాయిలో లాభాలు వచ్చేలా టీడీపీ గతంలో విశేష కృషి చేసిందని అప్పటి కేంద్రం కూడా స్పష్టంగా పేర్కొందని గుర్తు చేశారు. వీటన్నంటిని జీర్ణించుకోలేక వైసీపీ తప్పుడు కూతలు కూస్తోందని మండిపడ్డారు.

ప్రధాని చొరవతో విశాఖ ఉక్కుకు జీవం

● శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి



ఆత్మకూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ దోపిడీ విధానాలతో బలైన విశాఖ ఉక్కు పరిశ్రమ తిరిగి ప్రధానీ నరేంద్రమోదీ చొరవతో జీవం పోసుకుందని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. విశాఖ ఉక్కు పరిశ్రమ అభివృద్ధికి ప్రధానీ మోదీ రూ.11440 కోట్ల ఆర్థిక సాయం అందించడం సంతోషకరమని అన్నారు. ఇందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఎంతో కృషి చేశారని అన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల సెంటిమెంట్‌గా నిలిచి విశాఖ ఉక్కు పరిశ్రమ అభివృద్ధికి కేంద్ర మంత్రులు కుమారస్వామి, రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి టీజీ భరత్ కూడా తమవంతు సహకారం అందించారని తెలిపారు. కొన ఊపిరితో ఉన్న విశాఖ ఉక్కు పరిశ్రమకు కేంద్రం ఇచ్చిన ఆర్థిక చేయూత మరింత ప్రయోజనకరంగా ఉంటుందని వివరించారు.

విశాఖ ఉక్కుకు కేంద్రం భరోసా: గౌరు



కల్లూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు పరిశ్రమకు కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం అన్ని విధాలా ఆర్థిక భరోసా అందిస్తుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత మంగళవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఆంధ్రరాష్ట్ర మణిహారం విశాఖ కర్మాగారం వేలాది ప్రజల వీరోచిత పోరాటాలు, త్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్ పునరుజ్జీవానికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. గత సీఎం జగన్ తనపై ఉన్న కేసుల నుండి విముక్తి కోసం రాష్ట్రాన్ని తాకట్టు పెట్టేలా హస్తిన పర్యటనలు ఉండేవన్నారు. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన విశాఖస్టీల్ ప్లాంట్‌ను కాపాడేందుకు రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీని ఇచ్చేందుకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినేట్ ఆమోదముద్ర వేసిందన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయాలని, అమ్ముకోవాలని జగన్‌రెడ్డి ప్రయత్నిస్తే ఉక్కు పరిశ్రమను ఏవిధంగా పరిరక్షించాలని సీఎం చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారని ఎమ్మెల్యే వివరించారు.

'పట్టణంలోనే కొనసాగించాలి'

ఆత్మకూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలో విద్యుత్ బిల్లులు చెల్లించడానికి అందుబాటులోనే విద్యుత్ వినియోగ దారుల కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు రణధీర్ అన్నారు. మంగళవారం స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టి విద్యుత్ శాఖ ఏడీ సుబ్రమ ణ్యంకు వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు సురేంద్ర, ఇస్మాయిల్, వీరన్న, నాగేశ్వరరావు, కిరణ్, చంద్రశేఖర్, శ్రీకాంత్, రమేష్, రాజు తదితరులు ఉన్నారు.

'ఆధార్ సీడింగ్ చేయించాలి'

బండిఆత్మకూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): చిన్నారుల ఆధార్ సీడింగ్ తప్పనిసరిగా చేయించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి సూచించారు. లింగాపురం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం చిన్నారుల ఆధార్ నమోదును ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పుట్టిన పిల్లల నుంచి ఆరు సంవత్సరాలలోపు పిల్లలకు అంగన్ వాడీ కేంద్రాలలో ఆధార్ సీడింగ్ కొనసాగుతోందని చెప్పారు. ఈనెల 22న నారాయణపురం, 23న కడమలకాల్వ, 24న ఎ.కోడూరు, 27న పార్నపల్లె, 28న బండిఆత్మకూరు, 30న సంతజూటూరు గ్రామాల్లో క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

'సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి'

నందికొట్కూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 38 రకాల హమాలీ వృత్తుల వారికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, హమాలీల సంక్షేమానికి కృషి చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రఘురామ్మూర్తి డిమాండ్ చేశారు. పట్టణంలోని ఏఐటీయూసీ తాలుకా కార్యాలయంలో మంగళవారం పట్టణ బజారు హమాలీ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. హమాలీ కార్మికులు పట్టణ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం జనరల్ బాడీ సమావేశంలో రఘురామ్మూర్తి మాట్లాడుతూ చాలీచాలని కూలీలతో తమ ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టి జీవనం సాగిస్తున్న హమీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని హమాలీల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. 55 ఏళ్లు నిండిన ప్రతి హమాలీ కార్మికుడికి సామాజిక పింఛన్‌ను నెలకు రూ.6 వేలు చెల్లించాలని, అదే విధంగా ప్రతి కార్మికుడికి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు రాముడు, ఉస్మాన్‌బాషా, వాసవి శ్రీనివాసులు, జగదీష్, మధు, నాగస్వాములు పాల్గొన్నారు.

'జగనన్న కాలనీలో సమస్యలు పరిష్కరించాలి'



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నందికొట్కూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జగనన్న కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు, ప్రజలు ధర్నా చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ పట్టణ శివారులో నెలకొల్పిన జగనన్న కాలనీలో కనీస వసతులు లేక లబ్ధిదారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఎంతో ఆర్భాటంగా ఏర్పాటు చేసిన కాలనీలో కరెంటు, రోడ్లు, మంచినీటి వసతి లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అనంతరం కాలనీ వాసులతో కలిసి సీపీఎం నాయకులు మున్సిపల్ కమిషనర్ బేబికి వినతిపత్రం సమర్పించారు. నాయకులు గోపాలకృష్ణ, పక్కీర్‌సాహెబ్, షబ్బీర్, ఉస్మాన్ బాషా, దూదేకుల బాబు, నాగన్న, కాలనీ వాసులు గోకారి, అక్లీమ్, కరీముల్లా, శాల్మియా పాల్గొన్నారు.

మూసుకుపోయిన ఇసుక వాగు

● కంపచెట్లు, వ్యర్థాలతో నిండిన వైనం
● వెదజల్లుతున్న దుర్వాసన



కంపచెట్లతో నిండిన వాగు



వ్యర్థాలతో నిండిన వాగు

జూపాడుబంగ్లా, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పారుమంచాల చెరువుకు ఎగువ ప్రాంతం నుంచి కాకిలేరు వాగు ద్వారా వర్షపునీటితో నిండిపోతోంది. మండలంలో ఈ చెరువే పెద్దది. ఈ చెరువుకింద దాదాపు వెయ్యి ఎకరాల వరకు సాగు అవుతోంది. చెరువు నిండిన తర్వాత వాగుద్వారా పారుమంచాల, లింగాపురం, తరిగోపుల, 80బన్నూరు పొలిమేర మీద పారి శ్రీశైలం బ్యాక్‌వాటర్ నీటిలో వాగునీరు కలుస్తాయి. వాగు కంపచెట్లతో నిండిపోయి, పారుమంచాలలో వ్యర్థాలన్నీ వాగులోనే పడేయడంతో మూసుకుపోయింది. ప్రతి ఏడాది వర్షకాలంలో వాగు సరిగా లేకపోవడంతో పొలాల్లో పంటలపై పారడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పారుమంచాల నడిగ్రామంలో వాగు ఉండటంతో వేసిన వ్యర్థాలకు దుర్వాసన వెదజల్లుతోంది. వాసనకు భరించలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని మూసుకుపోయిన ఇసుకవాగును శుభ్రం చేయించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించాలి

● వసంత పంచమిని విజయవంతం చేయాలి
● నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

కొత్తపల్లి జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కొలనుభారతి పుణ్యక్షేత్రంలో ఫిబ్రవరి 2వ తేదీన జరిగే కొలనుభారతి సరస్వతి అమ్మవారి పుట్టినరోజు వేడుకలకు హాజరయ్యే భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించాలని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అధికారులను ఆదేశించారు. మండలంలోని కొలనుభారతి క్షేత్రంలో అమ్మవారి వసంత పంచమి ఏర్పాట్లపై మంగళవారం ఈవో రామలింగారెడ్డి అధ్యక్షతన ఎమ్మెల్యేతో పాటు ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలానికి చెందిన ఆయా శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్షించారు. క్షేత్రంలో చలువ పందిళ్లు, క్యూలైన్లు, తాగునీరు, ప్రత్యేక వైద్య శిబిరం, ఆలయ విద్యుద్దీపాలంకరణ, ఆర్టీసీ బస్సు సర్వీసులపై ఎమ్మెల్యే చర్చించారు. ఆలయానికి త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని, శివపురం గూడెం నుంచి ఆలయం వరకు రోడ్డు మరమ్మతులు, జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని సూచించారు. అటవీ ప్రాంతంలో ట్రాఫిక్ జామ్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫైరింజన్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. చారోగోష నదిని శుభ్రం చేయడంతో పాటు మహిళలకు దుస్తుల మార్పిడి తాత్కాలిక గదులు, టాయిలెట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కాశిరెడ్డినాయన ఆశ్రమ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

కమిటీ, స్థానిక ఆర్యవైశ్య సత్రం నిర్వాహకులు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేస్తారని తెలిపారు. ఈ వేడుకలకు సుమారు 20 వేల మందికి పైగా భక్తులు వచ్చే అవకాశం ఉందని, అందుకు తగ్గట్టుగానే ఏర్పాట్లు చేయాలన్నారు. సమీక్షకు హాజరు కాని విద్యుత్ ఏడీ, ఆర్‌అండ్‌బీ అధికారులకు నోటీసులు జారీ చేయాలని ఎమ్మెల్యే ఆర్డీవోకు సూచించారు. దేవదాయ శాఖ ఇన్‌చార్జి అసిస్టెంట్ కమిషనర్ మోహన్, ఆలయ ట్రస్ట్ చైర్మన్ వెంకటనాయుడు, తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీవో మేరీ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసరెడ్డి, ఆర్టీసీ డీఎం వినయ్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జుబేర్, డా.విజయేంద్ర, ఎస్ఐ కేశవ, స్థానిక సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చెరువు అలుగు ధ్వంసం



సంతజూటూరు చందనపు చెరువు అలుగుకు గండి కొట్టిన దృశ్యం

బండిఆత్మకూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంత జూటూరు గ్రామ చందనపు చెరువు అలుగుకు గుర్తు తెలియని వ్యక్తులు గండి కొట్టారు. రబీ సీజన్‌లో ముమ్మరంగా చెరువు కింద వరి నాట్లు కొనసాగుతున్నాయి. విషయం తెలుసుకున్న గ్రామ కమిటీ పెద్దలు, చెర్వు చైర్మన్ రామలింగారెడ్డి, సర్పంచ్ రామచంద్రుడు పరిశీలించారు. వీరు నేరుగా బండిఆత్మకూరు పోలీసుస్టేషన్‌కు చేరుకుని ఎస్ఐ జగన్మోహన్‌కు ఫిర్యాదు చేశారు. చెరువు పై భాగాన పొలాల్లో పంటలు సాగు చేయాలంటే నిల్వ ఉన్న నీరు బయటకు పోవాలంటే అలుగును తొలగించాలన్న ఉద్దేశంతోనే గుర్తు తెలియని వ్యక్తులు ఈ దురాగతానికి పాల్పడి ఉంటారని తెలిపారు. చెరువు అలుగును గత రెండు సంవత్సరాల క్రితమే నిర్మించారని, అలుగు ధ్వంసంపై అధికారులు పట్టించుకోకపోవటంతో చెరువులో సగ భాగం నీరు నిల్వ లేదని, రబీ పంట చేతికి రావటంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సొంత నిధులతో రోడ్లు



రోడ్డును పరిశీలిస్తున్న టీడీపీ నాయకుడు

నంద్యాల రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వైఎస్ నగర్‌కు చెందిన టీడీపీ ఇన్‌చార్జి బుగ్గరాముడు సరైన రోడ్డులేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఎస్టీ కాలనీలో, చర్చి ప్రాంతంలో సొంత నిధులు రూ1,30,000 వెచ్చించి రోడ్డు వేసి మంచి మనస్సు చాటుకున్నారు. మంగళవారం పనులను పరిశీలించారు. బుగ్గరాముడు మాట్లాడుతూ ప్రజల ప్రయాణ ఇబ్బందులను తొలగించాలని సదుద్దేశంతో సొంత నిదులు వెచ్చించి రోడ్డు వేసినట్లు తెలిపారు. దీంతో కాలనీల ప్రజలు అనందం వ్యక్తం చేశారు.

'నిధుల కేటాయింపు అభినందనీయం'

కొత్తపల్లి జనవరి 21 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు పరిశ్రమకు నిధులు కేటాయించడం అభినందనీయమని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. మంగళవారం మండలంలోని పెద్దగుమ్మడాపురంలో ఓ కార్యక్రమానికి హాజరైన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటు పరం చేసి జగన్ అమ్ముకోవాలని చూశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు ఢిల్లీకి వెళ్లిన ప్రతిసారి ప్రధాని మోదీతో చర్చలు జరిపి ఎట్టకేలకు ప్రధాని మోదీని ఒప్పించారన్నారు. రూ.11,440 కోట్ల భారీ ప్యాకేజీ వచ్చేలా కృషి చేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. నాయకులు నారపురెడ్డి, నాగేశ్వరరావు యాదవ్, రామకృష్ణారెడ్డి, మల్లయ్య, జానాల సుధాకర, రహింఖాన్ పాల్గొన్నారు.

'ఐ లవ్ ఆత్మకూరు' ఐకాన్ ఆవిష్కరణ

ఆత్మకూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన 'ఐ లవ్ ఆత్మకూరు' ఐకాన్‌ను మంగళవారం రాత్రి మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, కోఆప్షన్ సభ్యులు ఎంఏ.రషీద్, కౌన్సిలర్ గౌసఆజం, టీడీపీ పట్టణాధ్యక్షులు వేణుగోపాల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆత్మకూరు పట్టణానికి నూతన శోభ తీసుకురావాలన్న ఉద్దేశ్యంతోనే 'ఐ లవ్ ఆత్మకూరు' ఐకాన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టణ పౌరులందరికి ఆత్మకూరు పట్టణం పట్ల ఆప్యాయత నింపేలా ఈ లోగో ప్రేరేపిస్తుందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మొహబతుల్లా తదితరులు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



ఎమ్మెల్యే చేతుల మీదుగా విరాళం అందజేస్తున్న మహేశ్వరరెడ్డి

కొత్తపల్లి జనవరి 21 (ఆంధ్రజ్యోతి):కొత్తపల్లి మండలంలోని గువ్వలకుంట్ల గ్రామానికి చెందిన మల్లెల బూషిరెడ్డి కుమారుడు మహేశ్వరరెడ్డి రూ.లక్ష నగదును కొలను భారతి ఆలయ అభివృద్ధికి విరాళం ఇచ్చారు. ఎమ్మెల్యే జయసూర్య చేతుల మీదుగా దేవాదాయ శాఖ అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వెంకటనాయుడు, ఈవో రామలింగారెడ్డి, శివపురం సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్ నాయకులు నారపురెడ్డి, వెంకటేశ్వర్లు యాదవ్ పాల్గొన్నారు.

జిల్లాలో విజిబుల్ పోలీసింగ్

నంద్యాల క్రైం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ముమ్మర తనిఖీలు చేపట్టినట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో విస్తృత తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. సైబర్ క్రైం, రోడ్డు ప్రమాదాలు, డ్రగ్స్‌వాడకంతో కలిగే అన ర్థాలు, మహిళలపై నేరాల నివారణపై ప్రజలకు పోలీస్ అధికారులు అవగాహన కల్పించారన్నారు. జిల్లాలో నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు.

'విరాళాలు సేకరించలేదు'

నంద్యాల కల్చరల్/రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ కృష్ణ కాన్‌సెస్‌నెస్ (ఇస్కాన్) మందిరం నిర్మాణం పేరుతో విరాళాలు సేకరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, తాము ఎలాంటి విరాళాలు సేకరించలేదని ఇస్కాన్ ప్రతినిధి నిరంజన్ గోవిందదాస్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కొంతమంది ఇస్కాన్ పేరుతో విరాళాలు సేకరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అలాంటి వారిని నమ్మవద్దని, అలాంటి వారి పట్ల జాగ్రతగా ఉండాలని సూచించారు. ఇస్కాన్ పేరుతో ఎటువంటి మందిర నిర్మాణాలు తాము చేపట్టలేదన్నారు. కొందరు ఇస్కాన్ వారి దుస్తులు ధరించి విరాళాలు సేకరిస్తున్నట్లు తెలిసిందన్నారు. నకిలీ భక్తులను నమ్మి విరాళాలు ఇవ్వద్దన్నారు. ఇస్కాన్ పేరిట దాతల వద్దకు విరాళాలకు వస్తే నంద్యాల ఇస్కాన్ పర్యవేక్షకులు రామదాస ప్రభుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

'ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి'

మహానంది, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి పెంచుకొని తద్వారా అధిక దిగుబడి సాధించాలని వ్యవసాయశాఖ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ నరేంద్రరెడ్డి సూచించారు. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా గోపవరం గ్రామం సమీపంలోని వరి పొలాల్లో రైతులు రబీ సీజన్‌లో సాగు చేస్తున్న విధానాన్ని ప్రాజెక్ట్ మేనేజర్ పరిశీలించారు. మండలంలోని రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలన్నారు. రబీ సీజన్‌లో వరికి సోకే కాండం తొలుచు పురుగు ఆశించకుండా బీజామృతంతో నారు శుద్ధి చేసుకోవాలన్నారు. పురుగు ఉధృతిని నివారించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో ఇప్పటి వరకు నాలుగు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని మహిళా సంఘాలతో చేయిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది నుంచి ఇంకా రెండు గ్రామాల్లో చెయ్యడానికి ప్రణాళికలను రూపొందించామని తెలిపారు. ఏవో నాగేశ్వరరెడ్డి, నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు బాలాజీ నాయక్, సతీష్, విస్తరణాధికారి శ్రీనివాసరెడ్డి, రాజేశ్వరి పాల్గొన్నారు.

నేడు వైద్య శిబిరం

నంద్యాల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష, బసవ తారకం స్మైల్ ట్రైన్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత గ్రహణం మొర్రి, గ్రహణశూల స్క్రీనింగ్ మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ప్రేమంతకుమార్ మంగళవారం తెలిపారు. నంద్యాలలోని ఉప విద్యాశాఖాధికారి, సమగ్ర శిక్ష కార్యాలయం వెనుకభాగంలో ఉన్న కేఎన్‌ఎం మున్సిపల్ హైస్కూల్‌లో శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆరు నెలల నుంచి 50సంవత్సరాల వయసు గల వారు ఈ శిబిరానికి హాజరుకావచ్చన్నారు. గ్రహణం మొర్రి ఆపరేషన్ జరిగినవారు, గ్రహణ శూల ఆపరేషన్ చేయించుకున్నవారు కూడా క్యాంప్‌నకు హాజరుకావచ్చని సూచించారు. క్యాంప్‌నకు హాజరైనవారికి భోజన వసతి, ఉచితంగా పరీక్షలు నిర్వహించి రవాణా సదుపాయాలు కల్పించనున్నట్లు చెప్పారు. అవసరమైనవారికి హైదరాబాద్‌లో ఉచితంగా ఆపరేషన్ కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు.

రోబో తయారీపై శిక్షణ

పాణ్యం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రోబో తయారీపై ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ప్రారంభించారు. మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో బెంగుళూరు యూనిఫెస్ట్ రోబోట్ సంస్థ ఎండీ సునీల్‌కుమార్ శిక్షకుడుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రోబోల తయారీ, విడిభాగాల అనుసంధానం, పని విధానంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. రోబోల తయారీ ద్వారా పలు పారిశ్రామిక రంగాలలో ఉపాధి పొందవచ్చని హెచ్‌వోడీ తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. శిక్షణ అనంతరం విద్యార్థులు గ్రూపుగా మారి సొంత సంస్థలను ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందవచ్చన్నారు. ఈ శిక్షణలో మూడో సంవత్సరం మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్, డీన్ డాక్టర్ అశోక్‌కుమార్, డాక్టర్ అల్తాఫ్ హుశేన్, డాక్టర్ శిద్దారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్షయ నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న టీబీ సూపర్‌వైజర్ రవికుమార్

ఆత్మకూరు రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి ప్రాణాంతకం కాదని ఈ వ్యాధిపై ఎలాంటి భయాందోళన అవసరం లేదని టీబీ సూపర్‌వైజర్ రవికుమార్ అవగాహన కల్పించారు. మంగళవారం మండలంలోని కురుకుంద గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్షయ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. టీబీ సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. 15 రోజులు మించి దగ్గు, విపరీతమైన జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, గళ్లలో రక్తం పడటం ఇలాంటి లక్షణాలు కనిపించినట్లయితే సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్యకేంద్రంలో పరీక్షించుకోవాలని సూచించారు. గుట్కా, ధూమపానం, మద్యపానం అలవాట్లు ఉన్నవారికి, పౌష్టికాహార లోపం ఉన్నవారికి క్షయవ్యాధి సోకే అవకాశం ఉందన్నారు. వ్యాధినిర్ధారణ అయితే అక్కడి వైద్యశాలలోనే ప్రభుత్వం వ్యాధికి సంబంధించిన మందులు 6 నెలల పాటు ఉచితంగా ఇస్తుందని చెప్పారు. నెలకు రూ 500 చొప్పున పోషకాహారం తీసుకునేందుకు ప్రభుత్వమే రోగి ఖాతాకు జమ చేస్తుందని వెల్లడించారు. క్షయ వ్యాధిలక్షణాలు నిర్ధారణ అయిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వ్యాధి లక్షణాలు కనిపించిన తొలిదశలోనే నిర్ధారించడం వల్ల ఇతరులకు సోకకుండా అరికట్టొచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేశ్వరి, చెన్నమ్మ, వెంకటరమణ పాల్గొన్నారు.

'నిర్లక్ష్యం చేస్తే చర్యలు'

జూపాడుబంగ్లా, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆధార్ నమోదు, చేర్పులు, మార్పుల విషయంలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో గోపీకృష్ణ హెచ్చరించారు. జూపాడుబంగ్లాలో మంగళవారం ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. గతంలో వినియోగదారులు వస్తే ఆధార్ నమోదు తీసుకోకుండా ఇక్కడ సాధ్యం కాదని, నందికొట్కూరుకు వెళ్లడండని నిర్లక్ష్యవైఖరి అవలంభించినట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. ఇక మీదట ఎటువంటి పొరబాట్లు చేయకుండా నిబంధన మేరకు పనిచేయాలని ఆదేశించారు.

'జాగ్రత్తలు తీసుకోవాలి'



పెసరవాయిలో మందు తాపిస్తున్న ప్రత్యేక అధికారి

పాణ్యం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పశు ఆరోగ్యంపై పాడి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని అమరావతి పశుసంవర్ధక శాఖ ప్రత్యేక అధికారి డాక్టర్ మాధవరావు సూచించారు. పశు ఆరోగ్య శిబిరంలో భాగంగా మంగళవారం కౌలూరులో నిర్వహించిన పశు వైద్య ఆరోగ్య శిబిరంను ఆయనతో పాటు డీడీ డాక్టర్ శ్రీనివాసరావు పరిశీలించారు.ఆయన మాట్లాడుతూ పశు పోషకులకు నాణ్యమైన ఇన్‌పుట్ అందిస్తున్నామన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డు సౌకర్యం కల్పించామన్నారు. పిండ మార్పిడి పరిజ్ఞానం పెంచామన్నారు. ఈ సందర్భంగా 509 గొర్రెలకు, మేకలకు డీవార్మింగ్, 68 పశువులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించామన్నారు. 190 పశువులకు వ్యాక్సినేషన్ చేశామని ఏడీఏహెచ్ డాక్టర్ కమలాకర్ తెలిపారు. కౌలూరు ఎంపీటీసీ నల్లల భాస్కరరెడ్డి, డాక్టర్ పుల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

గడివేముల(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పశు ఆరోగ్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రత్యేక అధికారి, పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ మాధవరావు సూచించారు. మండలంలోని పెసరవాయి గ్రామంలో మంగళవారం పశుఆరోగ్య శిబిరాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పశువులు అనారోగ్యానికి గురి కాకుండా ఉండేందుకు ప్రభుత్వం పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తోందని అన్నారు. వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాడి రైతులను ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం అనేక రకాల పథకాలను అమలు చేస్తుందని అన్నారు. గోకులం షెడ్లు, బహువార్షిక పశుగ్రాస క్షేత్రాలు, పశుబీమా, లింగనిర్ధారిత వీర్యంపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. పాడి రైతులు పశుఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పశుసంవర్ధకశాఖ డీడీ శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరెక్టర్ కమలాకర్, పెసరవాయి పశువైద్యాధికారి బాబా పకృద్దీన్ పాల్గొన్నారు.

'వృద్ధుల కోసం ఆశ్రమం'

బండిఆత్మకూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఎలాంటి ఆదరణకు నోచుకోని వృద్ధులు, అనాథల కోసం ఆశ్రమం ఏర్పాటు చేసినట్లు చైతన్య కళాభారతి సంస్థ అధ్యక్షుడు వాసగిరి విజయభాస్కర్ తెలిపారు. మంగళవారం ఆయన బండిఆత్మకూరులో మాట్లాడుతూ వెలుగోడు జమ్మీనగర్ సమీపంలో విశాల వాతావరణంలో ఆశ్రమం ఏర్పాటు చేశామని , ఎవరైనా ఆదరణకు నోచుకోని వృదేకధలు, అనాథలు ఈ ఆశ్రమంలో చేరవచ్చని, కేవలం ఆధార్‌కార్డు తీసుకొని వచ్చి ఆశ్రయం పొందవచ్చని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

యాదవాడలో పార్వేట పూజలు


ఉత్సవమూర్తులు

ఆళ్లగడ్డ(రిశెళ్ల), జనవరి 21(ఆంధ్రజ్యోతి): అహోబిలం లక్ష్మీనరసింహస్వామి పార్వేట పల్లకి ఆళ్లగడ్డ మండలం మర్రిపల్లె, యాదవాడ గ్రామాల్లో పర్యటించింది. విశేష అలంకరణలో పార్వేట పల్లకిలో కొలువైన జ్వాలా నరసింహస్వామి, ప్రహ్లాదవరద దస్వామి ఉత్సవమూర్తులకు ప్రజలు భక్తిశ్రద్ధలతో మంగళవారం పూజలు నిర్వహించారు. స్వామి పల్లకి తెలుపులపై కొలువుదీరడంతో గ్రామాల్లో ఆధ్యాత్మికశోభ సంతరించుకుంది.

జాబ్‌మేళాకు స్పందన



మాట్లాడుతున్న జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్రీకాంత్

కోవెలకుంట్ల, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎస్వీబీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాకు మంచి స్పందన లభించింది. ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి వి. శ్రీకాంత్ పాల్గొని అభ్యర్థులకు పలు సూచనలు అందించారు. జాబ్ మేళాలో నాలుగు ప్రైవేటు కంపెనీలు పాల్గొన్నాయి. 96 మంది అభ్యర్థులు హాజరుకాగా 38 మంది ఉద్యోగ అర్హత సాధించారు. ఈ సందర్భంగా వారికి నియామకపత్రాలను ప్రిన్సిపాల్ అందించారు. కార్యక్రమంలో కాలేజ్ ఏపీఎస్ఎస్‌డీసీ, ఎస్‌ఈఈడీఏపీ సిబ్బంది పాల్గొన్నారు.

జీవో రద్దుపై హర్షం

బనగానపల్లె, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు జీవో నంబరు 59ను రద్దు చేయడంపై మాలమహానాడు నాయకులు దస్తగిరి, మారం మారం నాగరాజులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం బనగానపల్లె మాలమహానాడు కార్యాలయంలో వారు మాట్లాడుతూ జీవోను వ్యతిరేకంగా మాలమహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకటరావు హైకోర్టును ఆశ్రయించి నట్లు తెలిపారు. హైకోర్టు జీవోనంబరు 59ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుందని మాలమహానాడు నాయకులు తెలిపారు.

25న మండల సమావేశం

ఆవుకు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆవుకు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 25న మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంగన్న మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఎంపీపీ చల్లా రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరిగే సర్వసభ్య సమావేశంలో మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సమస్యలపై సమీక్ష జరుగుతుందన్నారు. అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి తప్పక హాజరు కావాలని తెలిపారు.

ఎక్సైజ్ సిబ్బంది దాడులు

డోన్ రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): డోన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని బేతంచెర్ల, ప్యాపిలి మండలాల్లోని రంగాపురం, గూటుపల్లి, ఆలేబాడు తాండా గ్రామాల్లో ఎక్సైజ్ పోలీసులు విస్తృత దాడులు చేశారు. ఇద్దరిని అరెస్టు చేసి 140 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి, ఎస్ఐ లు సోమశేఖర్, దౌలత్‌ఖాన్, సిబ్బంది ఉన్నారు.

'మధ్యంతర భృతి ప్రకటించాలి'

డోన్ రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి మధ్యంతర భృతిని ప్రకటించాలని యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం యూటీఎఫ్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో యూటీఎఫ్ నాయకులు సుబ్బరాయుడు, లక్ష్మినాయక్ పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

కోవెలకుంట్ల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ముగ్గురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి మంగళవారం తెలిపారు. వీరి నుంచి రూ.8,900 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వివరించారు.

శిథిలావస్థలో ఆయుర్వేద వైద్యశాల

- బిక్కుబిక్కుమంటూ సిబ్బంది విధుల నిర్వహణ
- ఇబ్బందుల్లో రోగులు


బనగానపల్లె ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల


పెచ్చులూడిన గది

బనగానపల్లె, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు పది పడకల ఆస్పత్రిగా ప్రసిద్ధి చెందిన బనగానపల్లె ఆయుర్వేద వైద్యశాల శిథిలావస్థకు చేరింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాయలసీమ జిల్లాల నుంచే గాక ఇతర జిల్లాలనుంచి కూడా బనగానపల్లెకు వచ్చి ఇన్‌పేషంట్లుగా ఉండి దీర్ఘకాలిక వ్యాధులను తగ్గించుకుని వెళ్లే వారు. అలాంటి ఆస్పత్రి నేడు శిథిలావస్థకు చేరుకుంది. దాంతో డాక్టర్, సిబ్బంది భయంభయంగా విధులు నిర్వర్తిస్తున్నారు.

ఆయుర్వేద వైద్యశాలలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. ప్రస్తుతం ఒక డాక్టర్, ఒక వాచ్‌మెన్, ఒక నర్స్, ఒక జూనియర్ అసిస్టెంట్ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో 1 అటెండర్, గార్డనర్, 1 ఎన్ఎమ్, 2 స్టాఫ్ నర్సులు, 2 కాంపౌండర్లు, హెర్బేరియం, మసాజిస్టు, రెండు స్వీపర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

సీనియర్ మెడికల్ వైద్యాధికారి భవనం పూర్తిగా కూలిపోయింది. ఔషధాలు నిల్వచేసే గదులు, స్టీమ్‌బాత్, మసాజ్ లాంటి పురాతన వైద్య పరికరాలు సిబ్బంది కొరతతో మూలన పడ్డాయి. భవనాలపై పెచ్చులు పూర్తిగా ఊడిపోయాయి. గతంలో ఆయుర్వేద వైద్యుడిగా పనిచేసిన డాక్టర్ పద్మనాభరెడ్డి ఆస్పత్రి భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపడంతో రూ.కోటి నిధులు విడుదల అయ్యాయి. అయితే హంసానంద సరస్వతి కమిటీ సభ్యులు ఆయుర్వేద వైద్యశాలను ప్రభుత్వం సరిగ్గా నిర్వహించలేకపోతుందని, లీజు రద్దు చేయాలని కోర్టుకు వెళ్లడంతో విడుదల అయిన నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. ఆయన తర్వాత విధులు నిర్వహించిన డాక్టర్ నాగరాజు తిరిగి ఆ యుర్వేద ఆస్పత్రి భవన నిర్మాణం కోసం ప్రతి పాదనలు పంపడంతో గత ఏడాది రూ.56.25 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం ఆ భవనం నిర్మాణంలో ఉంది.

పెచ్చులూడిపోతోంది

ఆయుర్వేద ఆస్పత్రి శిథిలావస్థకు చేరుకుంది. భవనం పెచ్చులూడిపోతోంది. వర్షాకాలం వస్తే మందులు తడిసిపోతున్నాయి. పాములు బెడద కూడా ఉంది. కొత్త భవన నిర్మాణం పూర్తి అయితే సమస్య తీరుతుంది. వైద్య సిబ్బందిని నియమించి పరికరాలు అందిస్తే బనగానపల్లె ఆయుర్వేద వైద్యశాలకు పూర్వవైభవం వస్తుంది.

- వాణి, ఆయుర్వేద వైద్యాధికారి

సస్యరక్షణ పద్ధతులు పాటించాలి


డోన్‌లో మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు

డోన్ రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మామిడి పంటలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు అన్నారు. మండలంలోని కొత్తపల్లి, ఉంగరానిగుండ్ల గ్రామాల్లో రైతులకు మామిడి పంటకు సంబంధించిన రైతుశిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉద్యాన పరిశోధన మహానంది సీనియర్ శాస్త్రవేత్త కిషోర్ రైతులకు శిక్షణ సంబంధించిన విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల ఉద్యానశాఖ అధికారి కళ్యాణి, రైతు సేవా సిబ్బంది పాల్గొన్నారు.

పోతుదొడ్డిలో ..

ప్యాపిలి: మామిడి సాగులో రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలని జిల్లా ఉద్యానవనశాఖ అధికారి నాగరాజు అన్నారు. మంగళవారం మండలంలోని పోతుదొడ్డి గ్రామంలో మామిడి సాగులో సస్యరక్షణ చర్యలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ప్రస్తుతం మామిడి తోటలు పూతదశలో ఉన్నాయన్నారు. ఎటువంటి చీడపీడలు, తెగుళ్లు సోకిన వెంటనే రైతులు ఉద్యానవనశాఖ అధికారులను సంప్రదించి తగిన సూచనలు, సలహాలు పాటించాలన్నారు. మామిడి తోటలు సాగుచేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు. ఉచితంగా మొక్కలు ఇవ్వడంతో పాటు మూడేళ్ల పాటు నిర్వహణ ఖర్చులు చెల్లిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల ఉద్యానవనశాఖ అధికారి కళ్యాణి, రైతులు పాల్గొన్నారు.

కాలువల మరమ్మతులకు ప్రతిపాదనలు


టీజీపీ ప్రధాన కాలువను పరిశీలిస్తున్న ఎస్ఈ, ఈఈ

చాగలమర్రి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ డివిజన్ పరిధిలోని టీజీపీ ప్రధాన కాలువ, బ్రాంచ్‌కెనాల్ మరమ్మతులకు రూ.25 కోట్లతో ప్రతిపాదనలు పంపించామని టీజీపీ ఎస్ఈ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి ఉన్న ప్రధాన కాలువ వెంట నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. అహోబిలం, ఆళ్లగడ్డ, చాగలమర్రి సమీపంలోని బ్రాంచ్‌కాల్వలను పరిశీలించారు. కాలువ స్థితిగతులను చూశారు. 21వ బ్లాక్‌కెనాల్ నుంచి 30వ బ్లాక్ చానల్ వరకు మరమ్మతులు చేసేందుకు నిధుల కోసం ప్రతిపాదనలు చేశామన్నారు. వీబీఆర్ నుంచి టీజీపీ కాలువకు 2,500 క్యూసెక్కుల నీరు విడుదల చేశామన్నారు. మార్చి చివరి వరకు ఆయకట్టుకు నీటి సరఫరా అవుతుందన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైతే టీజీపీ ప్రధాన కాలువ బ్రాంచ్‌కెనాల్ పనులు వేగవంతం చేస్తామన్నారు. ఆయన వెంట ఈఈ శంకర్‌రెడ్డి, డీఈలు వెంకటరమణ, రత్నరాజు, అనిల్‌కుమార్‌రెడ్డి, గురుమూర్తి, జేఈలు మోహనకృష్ణారెడ్డి, వినయ్‌కుమార్, రామాంజనాయక్, టీడీపీ నాయకులు శివారెడ్డి, రమణారెడ్డి, రైతులు ఉన్నారు.

ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దాలి


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ హరిప్రసాద్

బేతంచెర్ల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత నగర పంచాయతీగా తీర్చిదిద్దేందుకు దుకాణాల వ్యాపారులందరూ సహకరించాలని నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ సూచించారు. మంగళవారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో దుకాణాల యజమానులతో ప్లాస్టిక్ వస్తువులను వాడకం దిని సమావేశం నిర్వహించారు. అంగళ్లలో ప్లాస్టిక్ వస్తువులైన బ్యాగులు, గ్లాసులు వాడరాదన్నారు. ప్లాస్టిక్ వస్తువులు ఉంటే 15 రోజు లోపల ముగించాలన్నారు. వీటిని విక్రయించే వారిపై జరిమానాలు వేస్తామన్నారు. కార్యక్రమంలో గుండా జగన్మోహన్‌రావు, కందగడ్డల రమేష్, శ్రీధర్ ఉన్నారు.

శనగ సాగులో మెలకువలు పాటించాలి

కొలిమిగుండ్ల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): శనగ సాగులో రైతులు ప్రత్యేక మెలకువలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి జ్యోతి అన్నారు. మంగళవారం మండలంలోని పెట్నికోట గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

బనగానపల్లె: ప్రతి రైతు రైతు భరోసా కేంద్రంలో తాము వేసిన రబీ పంటలను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని చెర్వుపల్లె, పలుకూరు రైతు సేవా కేంద్రాల్లో రైతులకు వివిధ పంటలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

పాడిపరిశ్రమ అభివృద్దే ప్రభుత్వ లక్ష్యం

చాగలమర్రి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పాడిపరిశ్రమ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని పశువైద్యాధికారి దీపకుమారి తెలిపారు. మంగళవారం మండలంలోని మద్దూరు, చిన్నబోదనం గ్రామాల్లో పశుఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. పశువులు, గొర్రెలు, మేకలు, ఎద్దులకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటేష్, బీ ఎల్‌వోలు మురళీకృష్ణ, జమాల్‌వలి, తిరుపతయ్య, గోపాలమిత్ర వీరయ్య, వీహెచ్ఏలు, రైతులు పాల్గొన్నారు.

క్రిష్టిపాడు గ్రామంలో...

దొర్నిపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లోని పాడి రైతులు పశువుల ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలని ఆళ్లగడ్డ పశువైద్యశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ కొండారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో డబ్ల్యూకొత్తపల్లె పశువైద్యాధికారి కేవీఆర్ పుల్లయ్య, జేడీవో రమణయ్య, పశువైద్య సిబ్బంది ఉన్నారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి


ప్యాపిలిలో సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో నరసింహులు

ప్యాపిలి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని డోన్ ఆర్డీవో నరసింహులు అన్నారు. మంగళవారం రెవెన్యూ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి రైతుల అభిప్రాయాలను పరిగణనలోని తీసుకొని పరిష్కరించాలన్నారు. అలాగే రీ సర్వేను కూడా పగడ్బందీగా చేయాలన్నారు. సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ సుధాకర్‌రెడ్డి, ఆర్ఐ సుజాత, వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

'అన్నదాన సత్రానికి నోటీసులు ఇవ్వడం అన్యాయం'

బనగానపల్లె, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ శక్తి క్షేత్రమైన నందవరంలోని యాదవ అన్నదాన సత్రం తొలగించాలని ఆలయ ఈవో నోటీసులు ఇవ్వడం అన్యాయమని బీజేపీ జిల్లా నాయకుడు శివకృష్ణయాదవ్, యాదవ సంఘం నాయకులు అన్నారు. మంగళవారం యాదవ సంఘం సభ్యులు మాట్లాడుతూ నందవరంలో దేవదాయ శాఖ ఏర్పడినప్పటినుంచి యాదవ అన్నదానసత్రం ఉందన్నారు. చౌడేశ్వరీ ఉత్సవాల సందర్భంగా ఉచితంగా అన్నదానాలు చేస్తున్నట్లు తెలిపారు. యాదవ సత్రాన్ని కాపాడానికి ఎంతవరకైనా పోరాడతామన్నారు. కార్యక్రమంలో యాదవసంఘం నాయకులు బాల వెంకటేశ్వర్లు, సీలమన్న, శ్రీనివాసులు, బాలవెంకటేశ్వర్లు, గణేష్‌యాదవ్, రామకృష్ణుడు, బలరాముడు, రామన్న, ఆదిశేషులు, బీజేపీ నాయకులు యాదగిరి, రామసుబ్బయ్య, రవికుమార్, హరికృష్ణ పాల్గొన్నారు.

పందుల తరలింపులో నిర్లక్ష్యం

- నెల రోజుల క్రితం నోటీసులిచ్చిన అధికారులు
- నేటికీ స్పందించని యజమానులు


పొలంలో సంచరిస్తున్న పందులు

కొలిమిగుండ్ల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పందుల తరలింపులో పంచాయతీ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. పందుల బెడదతో పంటలు నాశనం అవుతున్నాయని, ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని ఇటు రైతులు, అటు ప్రజలు గగ్గోలు పెడుతున్నా అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. రైతులు, వివిధ వర్గాల ప్రజల వినతులతో పాటు, పత్రికల్లో వచ్చిన వరుస కథనాలతో స్పందించిన అధికారులు నెల రోజుల క్రితం పందుల యజమానులకు నోటీసులిచ్చారు. వారం రోజుల్లో పందులను తరలించుకోవాలని లేదంటే, అధికారులే తరలిస్తారని హెచ్చరించారు. దీనికోసం పోలీసులు, వివిధ శాఖల అధికారులతో సమన్వయ కమిటీని నియమించుకున్నారు. అయితే నెల రోజులవుతున్నా పందుల తరలింపు జరగలేదు. దీంతో ఇటు రైతులకు, అటు ప్రజలకు పందుల బెడద తప్పలేదు. అధికారుల నిర్లక్ష్యంపై రైతులు మండిపడుతున్నారు. చేతికొచ్చిన పంట పొలాలు నాశనం చేస్తున్నా పట్టించుకోరా ..? అంటూ ప్రశ్నిస్తున్నారు. మరింత నష్టం కలగక ముందే ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని పందుల బెడద నుంచి తప్పించాలని కోరుతున్నారు.

ఆర్థిక భరోసాపై ఎమ్మెల్యే కోట్ల హర్షం

డోన్ రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు చొరవతో విశాఖ ఉక్కు కర్మాగారానికి కేంద్రం ఆర్థిక భరోసా ఇస్తూ ప్రకటన చేయడం హర్షణీయమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ జరగకుండా సీఎం చంద్రబాబు నాయుడు అడ్డుకుంటూ కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.14400 కోట్ల ఆర్థిక భరోసాను సాధించారన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి నిధులు తీసుకురావడంలో సీఎం చంద్రబాబుతో పాటు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఎంపీలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

భూ రీసర్వే పకడ్బందీగా నిర్వహించాలి

చాగలమర్రి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): భూ రీసర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ రవిశంకర్ సూచించారు. మంగళవారం నేలంపాడు గ్రామంలో మండల సర్వేయర్, వీఆర్వోల ఆధ్వర్యంలో భూ రీసర్వే నిర్వహించారు. భూముల సరిహద్దులు, కొలతలు సక్రమంగా తీసుకోవాలని తహసీల్దార్ సూచించారు. రికార్డుల ఆధారంగా భూ విస్తీర్ణం కొలతలను తీయాలని అన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో శ్రీనివాసులు, ఆయా గ్రామాల సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

నరసింహ స్వామి మాలధారులకు అన్నదానం

చాగలమర్రి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో నరసింహస్వామి మాలధారులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంగళవారం ఆలయ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, లక్ష్మీనరసింహస్వామి సేవా సంఘం అధ్యక్షుడు గుర్తినరసింహులు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. 40 మంది మాలధారులు ఆలయంలో నరసింహస్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగు లాభదాయకం

చాగలమర్రి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పండ్ల తోటల సాగు లాభదాయకమని ఉపాధి ఏపీవో నిర్మల అన్నారు. మంగళవారం రాంపల్లె గ్రామంలో ఉపాధి నిధులతో చేపట్టిన ప్లాంటేషన్‌ను పరిశీలించారు. అలాగే రహదారికి ఇరువైపుల నాటిన మొక్కలను పరిశీలించి కూలీలతో నీరు పోయించారు. రాంపల్లె గ్రామం నుంచి 40వ జాతీయ రహదారి వరకు 400 కానుగ మొక్కలను నాటించామన్నారు. వాటి సంరక్షణ బాధ్యత ఎఫ్ఏలకు అప్పగించామన్నారు. హార్టికల్చర్ కింద 63 ఎకరాల్లో రైతులు పండ్ల సాగుచేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఏ ఉన్నారు.

కుష్టు వ్యాధి సర్వే తనిఖీ

శిరివెళ్ల, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందపల్లె గ్రామంలో నిర్వహిస్తున్న కుష్టు వ్యాధి సర్వేను వైద్యాధికారి దివ్య మంగళవారం తనిఖీ చేశారు. ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించి అనుమానిత లక్షణాలున్న వ్యక్తులను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు సిఫారసు చేస్తారన్నారు. ఫిబ్రవరి 2వరకు గ్రామాల్లో సర్వే కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రామ్మోహన్‌రెడ్డి, పీహెచ్ఎన్ సరస్వతి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు ఆధార్ నమోదు కేంద్రం

శిరివెళ్ల, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన శిరివెళ్లలోని సచివాలయం-4లో చిన్నారుల కోసం ప్రత్యేకంగా ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో శివ మల్లేశ్వరప్ప మంగళవారం తెలిపారు. ఇప్పటి వరకు ఆధార్ నమోదు చేయించుకోని 0 నుంచి 6 సంవత్సరాల వయస్సుగల చిన్నారుల ప్రయోజనార్థం నిర్వహిస్తున్న కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిన్నారుల బర్త్ సర్టిఫికెట్, తల్లిదండ్రుల ఆధార్ కార్డులతో కేంద్రానికి హాజరుకావాలన్నారు.

ఏటీఎం సెక్యూరిటీగార్డుపై దాడి

శిరివెళ్ల, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రగుంట్ల గ్రామంలోని ఐసీఐసీఐ బ్యాంకు ఏటీఎం సెక్యూరిటీ గార్డుపై ముగ్గురు యువకులు దాడికి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళితే.. గుంప్రమాన్‌దిన్నె మజరా గ్రామమైన గంగవరానికి చెందిన రామకృష్ణుడు అనే వ్యక్తి యర్రగుంట్ల ఐసీఐసీఐ ఏటీఎం కేంద్రం వద్ద ప్రతిరోజూ రాత్రి సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి 11.30 గంటల సమయంలో చెన్నూరు, గోవిందపల్లె గ్రామాలకు చెందిన ముగ్గురు యువకులు డబ్బులు తీసుకునేందుకు ఏటీఎం కేంద్రానికి వచ్చారు. ఏటీఎంలో డబ్బులు లేవని సెక్యూరిటీ గార్డు చెప్పినప్పటికీ వారు వినకుండా అతనితో గొడవకు దిగి దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. దీంతో బాధితుడు రామకృష్ణం రాజు పోలీసులను ఆశ్రయించాడు.

పేదలకు పెళ్లి కానుక పంపిణీ


పెళ్లికానుక పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీసీ రాజారెడ్డి కార్యాలయంలో మంగళవారం ఇద్దరు తల్లిదండ్రులు లేని పేదలకు బీసీ గురైడ్డి, లక్ష్మమ్మల జ్ఞాపకార్థం బీసీ రాజారెడ్డి నవవధువుకు పెళ్లికానుక అందించారు. పేదలు పెళ్లికానుకలను సద్వినియోగం చేసుకోవాలని బీసీ రాజారెడ్డి కోరారు.

వెలుగు బుక్ కీపర్ల తొలగింపు: ఏపీఎం

బనగానపల్లె, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పొదుపు గ్రూపుల నుంచి ముడుపులు వసూలు చేస్తుండడంతో మండల సమాఖ్య తీర్మానం మేరకు బనగానపల్లె పట్టణానికి చెందిన ఇద్దరు బుక్‌కీపర్లను తొలగించినట్లు వెలుగు ఏపీఎం శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. వెలుగు కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బనగానపల్లె పట్టణానికి చెందిన సాయికుమార్, మధుశేఖర్ బుక్‌కీపర్లుగా పనిచేస్తూ మహిళల కు సంబంధించి రుణాల మంజూరులో చేతివాటం ప్రదర్శిస్తున్నారని పొదుపు గ్రూపు సభ్యులు విచారణలో తెలపడంతో డీఆర్‌డీఏ పీడీ ఆదేశాల మేరకు పూర్తిస్థాయిలో విచారణ జరిపి విధుల నుంచి తొలగించినట్లు ఆయన తెలిపారు. అలాగే పట్టణంలో మరికొంత మంది బుక్‌కీపర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని వారిపై దృష్టి సారించినట్లు తెలిపారు.

సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించండి

కొలిమిగుండ్ల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులు బిల్లులను సకాలంలో చెల్లించాలని విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఏఈ లక్ష్మయ్యస్వామి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అలస్యంగా బిల్లులు చెల్లించడం ద్వారా వినియోగదారులకు అదనపు చార్జీలు పడతాయని తెలిపారు. ప్రతి వినియోగదారుడు 14వ తేదీ లోపు విద్యుత్ బిల్లులు చెల్లించాలని ఆయన సూచించారు.

శ్రీసుధా విద్యాసంస్థ గౌరవ సలహాదారు మృతి


శశికళ (ఫైల్)

డోన్ రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): డోన్ శ్రీసుధా విద్యాసంస్థల గౌరవ సలహాదారు శశికళ (51) మంగళవారం మృతి చెందారు. గుండె జబ్బుతో బాధపడుతున్న ఆమె హైదరాబాదులో ఐటీవల గుండె మార్పిడి చికిత్స చేయించుకుని దని కుటుంబ సభ్యులు తెలిపారు. గుండె మార్పిడి చికిత్స అనంతరం చేతికోకల మృతి చెందినట్లు తెలిపారు. పట్టణంలోని కేవీఎస్ కాలనీలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులైన సాధనగిరి సుదర్శన్ భార్య శశికళ మృతికి డోన్ యూటీఎఫ్ శాఖ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.